RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 86 ISSUE NO : 86 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శుక్రవారం, సెప్టెంబర్, 19, 2025 Friday, September,19, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## కొడుకు పెళ్లి రిసిప్షన్ రద్దు చేసుకున్న ఎమ్మెల్యే

**రైతుల సంక్షేమంకోసం 2కోట్లు ఇవ్వాలని నిర్ణయం**
**సిఎం రేవంత్‌ను కలిసి చెక్ అందచేసిన బత్తుల లక్ష్మారెడ్డి**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఉదారత చాటుకున్నారు. రైతుల సంక్షేమం కోసం రెండుకోట్లు విరాళంగా ఇచ్చారు. దీనిని చెక్కు రూపంలో సిఎం రేవంత్ రెడ్డికి అందించారు. తన నియోజకవర్గంలోని రైతుల కోసం ఖర్చు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , ఆయన కుటుంబసభ్యులు విరాళం అందించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌ను లక్ష్మారెడ్డి కలిసి రూ.2కోట్ల చెక్ అందజేశారు. లక్ష మంది రైతులకు ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందించాలని సీఎంను ఆయన కోరారు. ఇటీవల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుమారుడు సాయి ప్రసన్న వివాహం జరిగింది. మిర్యాలగూడలో భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భావించారు. కానీ రిసెప్షన్‌ను రద్దు చేసుకుని ఆ డబ్బును రైతుల కోసం ఖర్చు చేసేందుకు ఆయన ముందుకు వచ్చారు. దీంతో వెంటనే సిఎంకు చెక్కును అందించారు. లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను సీఎం అభినందించారు.

## అభాగ్యుల కన్నీళ్లు తుడవలేని ప్రభుత్వం

**ఇటీవలి ప్రమాదాలపై కెటిఆర్ ఆగ్రహం**



**హైదరాబాద్, తెలంగాణ దిశ :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అభాగ్యుల కన్నీళ్లు తుడవలేని అమానవీయ సర్కార్ ఇది అని కేటీఆర్ విమర్శించారు. అది ఎస్ఎల్‌బీసీ సొరంగం అయినా, సిగాచీ పరిశ్రమ అయినా, హైదరాబాద్ వరదలయినా, ప్రతి చోటా అదే నేరపూరిత నిర్లక్ష్యం, అదే చేతగానితనం అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు. వరదనీటి నాలాల్లో ముగ్గురు గల్లంతై నాలుగు రోజులు దాటినా కాంగ్రెస్ సర్కార్ చేష్టలుడిగి చూస్తుందని మండిపడ్డారు. ప్రాణాలు ఎలాగూ కాపాడలేరు.. దురదృష్టవశాత్తూ ఎవరైనా మరణిస్తే కనీసం పార్థివదేహాలు అయినా వెలికితీయలేని అసమర్థ ప్రభుత్వం ఇది! అభాగ్యుల కన్నీళ్ళు తుడవలేని అమానవీయ సర్కారు ఇది! అని కేటీఆర్ విమర్శించారు.

**-పార్టీలో 75 ఏళ్ల నిబంధన తీసుకు వచ్చిందే మోడీ**
**-తనకు తానే వైదొలగాల్సిందే తప్ప రిటైర్మెంట్ అడిగే ధైర్యం ఎవరికి ఉంది..?**

ఢిల్లీ,: ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. బుధవారం రోజు ఆయన బర్త్ డేను దేశవ్యాప్తంగా ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు. దేశ, విదేశాల నుంచి ఆయనకు శుభాకాంక్షలు అందాయి. ఆ వేడుకలన్నీ నిన్నటితో పూర్తయ్యాయి. బయట వ్యక్తులకు సంబంధం లేకపోయినా.. బీజేపీలోని పెద్దలకు మాత్రం బర్త్ డే శుభాకాంక్షలతో పాటు హ్యాపీ రిటైర్మెంట్ డే అని కూడా చెప్పాలని ఉంటుంది. కానీ చెప్పలేకపోయారు. ఇక ముందు కూడా అలా అడిగే ధైర్యం ఎవరికీ ఉండకపోవచ్చు. ఎందుకంటే బీజేపీ అంటే మోదీ.. మోదీ అంటే బీజేపీ అనే రీతిలో ఆయన బలపడ్డారు మరి.. ! బీజేపీలో 75 ఏళ్ల రూల్ తెచ్చింది మోదీనే!: భారతీయ జనతా పార్టీ ప్రధాని మోదీ చేతుల్లోకి వెళ్లిన తర్వాత.. అమిత్ షాతో కలిసి బీజేపీని సంస్కరించారు. సీనియర్లు పార్టీ ఎదుగుదలకు భారంగా ఉన్నారని.. వారందర్నీ ఒకరి తర్వాత ఒకర్ని బయటకు పంపేందుకు 75 ఏళ్ల నిబంధన తీసుకు వచ్చారు.



## బీజేపీలో నరేంద్రమోదీ కి.. ప్రత్యామ్నాయం లేదు



ట్రంప్ కు మరో షాక్..

## భారత్‌కు రానున్న యూకే ప్రధాని స్టార్మర్

**- అక్టోబర్‌లో భారత్‌లో పర్యటించనున్న బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్**

ఢిల్లీ,:భారత్, బ్రిటన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడనుంది. ఇదే సమయంలో భారత్‌ను ఇబ్బంది పెట్టేందుకు పలు విధాల యత్నిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు షాక్ తగలబోతోంది.బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ భారత్‌లో పర్యటించేందుకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ నెలలో ఆయన పర్యటన ఉండే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో భాగంగా ముంబైలో జరిగే ప్రతిష్టాత్మక ఫిన్‌టెక్ సదస్సులో ఆయన పాల్గొంటారని తెలుస్తోంది. ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీ లండన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే.



## నేపాల్ శాంతిస్థాపనకు మద్దతు

### నేపాల్ ప్రధాని సుశీలా కార్కీకు మోడీ ఫోన్

న్యూఢిల్లీ, : నేపాల్‌లో శాంతి స్థాపనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రధాని మోడీ ప్రకటించారు. ఈ మేరకు ప్రధాని సుశీల కార్కీకు మోడీ సందేశం పంపారు. సోషల్ మీడియాపై నిషేధం, అవినీతి వ్యతిరేక నిరసనలతో కొన్ని రోజుల క్రితం అట్టుడికిన నేపాల్ లో పరిస్థితులు కుదుటపడ్డాయి. ఈ క్రమంలో ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా కార్కీ తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన విషయాలను మోదీ ఎక్స్‌లో పంచుకున్నారు.

## ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు

**ఇతర రాష్ట్రాల ఫోన్లు ఉపయోగింపు**
**ఒక రాష్ట్రం తరవాత మరో రాష్ట్రం**
**కాంగ్రెస్‌కు పడే ఓట్ల జాబితా గుర్తించి చర్య**
**పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాహుల్ వివరణ**

న్యూఢిల్లీ, : కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు దిల్లీలో మీడియా సమావేశంలో ఆరోపణలు చేశారు. ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక పక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు- వేసే కమ్యూనిటీలను మరీ ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించామన్నారు. త్వరలో ఎన్నికల సంఘంపై హైడ్రోజన్ బాంబ్ పేల్చబోతున్నట్లుగా ప్రకటించినట్టుగానే గురువారం రాహుల్‌గాంధీ పేల్చారు. ఓట్ల చోరీపై గతంలో కొన్ని ఆధారాలు బయటపెట్టగా.. ఈరోజు మరిన్ని ఆధారాలను బయటపెట్టారు. మీడియా ముందు వీడియో ప్రజెంటేషన్ ఇస్తూ... ఓట్ల చోరీపై 100 శాతం ఆధారాలతో రుజువులు బయటపెడుతున్నట్లు- ప్రకటించారు. దేశ వ్యాప్తంగా లక్షలాది ఓట్లు- తొలగించాలని కొంత మంది కంకణం కట్టుకున్నారని.. దానికి ఎన్నికల సంఘం వత్తాసు పలుకుతుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే ఈసీ కళ్ల ప్పగించి చూస్తోందని ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రంలో ఎన్నికలు అయిపోతే.. ఇంకొక రాష్ట్రంలో.. ఇలా అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల సమయానికి లక్ష లాది మంది ఓట్లను తొలగిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఇందుకోసం కేంద్రీకృత సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి.. కాంగ్రెస్ బూత్‌ల నుంచి ఓట్లు- తొలగించారని వివరించారు. ఇందుకు ప్రత్యేక ఉదాహరణగా 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు బలమైన ఓటు- బ్యాంక్ ఉన్న బూత్‌ల నుంచి వేలాది ఓట్లు తొలగించినట్లు- వెల్లడించారు. వేరే రాష్ట్రాల ఫోన్ నెంబర్లు, నకిలీ లాగిన్‌లు ఉపయోగించి ఓటర్ పేర్లు తొలగించారన్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ ఉపయోగించారని స్పష్టం చేశారు. ఒక ఎన్నిక తర్వాత ఒక ఎన్నికలో.. భారతదేశం అంతటా లక్షలాది మంది ఓటర్లను.. వివిధ వర్గాలను, ప్రధానంగా ప్రతిపక్షానికి ఓటు- వేస్తున్న వర్గాలను, తొలగింపు కోసం ఒక సమూహం క్రమపద్ధతిలో లక్ష్యంగా చేసుకుంటున్నారు.







## స్థానిక ఎన్నికల కోసం జంబో కమిటీలు

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** స్థానిక సంస్థల ఎన్నికల ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర పీసీసీ పదవులపై దృష్టి సారించింది. డీసీసీని బలోపేతం చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రణాళిక ప్రకారంగా ఆచితూచి అడుగులు వేస్తుంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన దాదాపుగా రెండేళ్ల దగ్గర పడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు పార్టీ పదవులు నామినేషన్లపై పోస్టుల భర్తీపై పెద్దగా దృష్టి సారించలేదు.పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు క్షేత్రస్థాయిలో కష్టపడిన నేతలు కార్యకర్తలకు పదవులు దక్కకపోవడంతో వారిలో కొంత నిరుత్సాహం దాపురించింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కొందరికి నామినేషన్ పోస్టులు దక్కగా మిగతావారు కొంత నారాజ్‌గా ఉన్నారు. అవకాశం వచ్చిన ప్రతి సందర్భంలో సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ ను సభలు సమావేశాల్లో పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని వారిలో కొంత ఉత్సాహం నింపుతూ వచ్చారు. అప్పటినుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు నామినేషన్ల పదవులు పార్టీపదలో కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని మరి ఎదురుచూస్తున్నారు.

## సాఫ్ట్‌వేర్‌తో ఓట్ల తొలగింపు అసాధ్యం

- రాహుల్ విమర్శలను ఖండించిన ఇసి
- అబద్దాల ప్రచారంతో అస్థిరత సృష్టించే యత్నం
- రాహుల్ విమర్శలపై మండిపడ్డ బిజెపి నేతలు

న్యూఢిల్లీ, : ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటు తొలగించడం లేదు.. ఆన్‌లైన్‌లో మరెవరూ తొలగించలేరని కూడా వివరించింది. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజవర్గంలో ఓటర్ల తొలగింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం.. అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో భాజపా అభ్యర్థి విజయం సాధించారు.

# నైజాం, నేటి మోడీ సర్కార్ల పాలన ఒక్కటే

## - చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్
## - సిపిఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్ వీరయ్య



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18, (తెలంగాణ దిశ)** :నాటి నైజాం పాలన, నేటి నరేంద్ర మోడీ పాలనలో తేడాలు ఏమీ లేవని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్ వీరయ్య విమర్శించారు. గురువారం ఆయన నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ సుందరయ్య విజ్ఞాన భవన్ లో ఏర్పాటుచేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రమంత్రి రాజ్నాథ్ సింగ్ తన ప్రసంగంలో చెప్పినవన్నీ అబద్ధాలేనని విమర్శించారు. విమోచన దినం అనేది పెద్ద అబద్ధం అన్నారు. ట్రంప్ పెత్తనం చేస్తుంటే మోడీ తలవంచుకుంటూ ఉన్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. కేంద్ర మంత్రులకు దేశభక్తులుగా చెప్పుకునే అర్హత లేదని స్పష్టం చేశారు. కేంద్ర బిజెపి మంత్రులు దేశ ద్రోహుల గ్యాంగుగా మారారని దుయ్యబట్టారు. తెల్ల దొరల కోసం పనిచేసిన వారు దేశద్రోహులే అవుతారని విమర్శించారు. నాటి రజా కార్లకు నేటి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు పెద్ద తేడా ఏమీ లేదని వివరించారు. హైదరాబాద్ పోరాటంలో బిజెపి ఆనవాళ్లే లేవని, నాటి రజాకారులకు నేటి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు పెద్ద తేడా ఏమీ లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ రాజుగా వ్యవహరిస్తూ తన ఇష్టం వచ్చినట్లు పరిపాలన నడిపిస్తున్నారని ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టి లాంటిదని అన్నారు. నిజాం కాలంలో భాషా దీక్ష ఉండేదని నేడు ఇంకా బానిస మనస్తత్వం పోలేదని తెలిపారు. అప్పట్లో ఉర్దూ, నేడు హిందీని బలవంతంగా రుబ్బుతున్నారని విమర్శించారు. మాతృభాషను పక్కకు పెట్టడం సరికాదని స్పష్టం చేశారు. నిజాం రాజు భూస్వాముల పరిరక్షణ కోసం నిలబడితే నేడు మోడీ అమిత్షాలు అంబానీ ఆదానిలా పరిరక్షణ కోసం పాటుపడుతున్నారని ఎద్దేవా చేశారు. నెహ్రూ, షేక్ అబ్దుల్లా వలనే నేడు జమ్మూ కాశ్మీర్ భారతదేశంలో కలిసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి. సత్యం మాట్లాడుతూ తెలంగాణలోపేదలకు భూములు పంచిన ఘనతకమ్యూనిస్టులదే అని గుర్తుచేశారు. నాడు భూమి, భుక్తి, విముక్తి కోసం దున్నేవానికి భూమి కావాలని, వెట్టి చాకిరి మట్టు పెట్టాలని సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా సాగించిన పోరాటమని వివరించారు. నాడు నిజాంపై సాగిన పోరాటాన్ని కుల, మతాల మధ్య జరిగిన పోరాటంగాబిజెపి చిత్రీకరిస్తూ చరిత్రని తప్పుదారి పట్టించాలనిబిజెపి చూడడం క్షమించరానిదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, బాచుపల్లి మండల కార్యదర్శి బి వెంకటరామయ్య, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాథోడ్ సంతోష్,సిపిఎం పార్టీ బాచుపల్లి మండల కమిటీ సభ్యులు బాల వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, సూర్య ప్రకాష్, చంద్రశేఖర్, సిపిఎం సీనియర్ నాయకుడు సిహెచ్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.




# సింహపురి కాలనీ సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18, (తెలంగాణ దిశ)** :నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ 2 వ డివిజన్ పరిధిలోని సింహపురి కాలనీలో గురువారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలను హనుమంత రెడ్డి సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. పాత సిసి రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు హనుమంత రెడ్డికి గత కొంతకాలంగా విజ్ఞప్తులు చేయడంతో ఆయన కార్పొరేషన్ అధికారులతో సంప్రదించి నిధులను విడుదల చేయించి నూతన సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. దీంతో కాలనీవాసుల రాకపోకలకు సౌకర్యం మెరుగుపడినట్లు అయింది. ఈ సందర్భంగా కొలను హనుమంతరెడ్డిని స్థానికులు శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెండవ డివిజన్ మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, కాంగ్రెస్ పార్టీ ఎన్ఎంసి ప్రధాన కార్యదర్శి కొలను జీవన్ రెడ్డి, వీరబాబు, ఆదిరెడ్డి, నారాయణరెడ్డి, వాసు, ఆంజనేయ వర్మ, శ్రీనివాస్, రఫాత్, ప్రశాంత్ రెడ్డి, సందీప్, మహేష్, సింహపురి కాలనీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, బాల్రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాసరావు, రామ్ కుమార్, సత్యనారాయణ రావు, శ్రీనివాస్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ దిశ)** :మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆయన నివాసంలో ఎమ్మెల్యే అరికపూడి గాంధీతో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, అక్బర్ ఖాన్ తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# తెలుగు సంస్కృతిని భావి తరాలకు అందించాలి

## - కార్పొరేటర్ నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 18, (తెలంగాణ దిశ)** : శేరిలింగంపల్లి మండల రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బిహెచ్ఈఎల్ అంబేద్కర్ స్టేడియంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ ఈ నవరాత్రి ఉత్సవాలలో సుమారు 40 పాఠశాలల నుండి 2000 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. అందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి తెలంగాణ, తెలుగు వారి ఆచార సంస్కృతిని ప్రతిబింబించేలా ఆనందంగా ఆడిపాడి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారని వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ వేడుకలలో భాగంగా బతుకమ్మ వేడుకలను అత్యంత ప్రాధాన్యతగా తెలంగాణ రాష్ట్రంలో జరుపుకోవడం మన ఆనవాయితీ అని అన్నారు. ప్రతి ఒక్కరూ నవరాత్రి ఉత్సవాలను అద్భుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. అందరిపై అమ్మవారి కృప ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాగేంద్ర యాదవ్ విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడి వారిని ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ అధ్యక్షులు ఏఆర్. పవన్ కుమార్, కార్యదర్శి పి. త్రిమూర్తులు, ఖజాంచి, శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ సత్యవాణి, ట్రస్మా అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ డాక్టర్ కె. అనిల్ కుమార్, సీనియర్ కరస్పాండెంట్స్ లయన్ బి. వెంకటేశ్వరరావు, నరేంద్రబాబు, ఎస్ఎన్ రావు, విజయ్, సలీం, రోజీ, ప్రదుమ్న, సురేష్, కమలేష్, రత్నకుమారి, రవీందర్, శైలజ, జితేందర్, సుష్మిత, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.





# మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## - మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్




**కాప్రా, సెప్టెంబర్ 18, (తెలంగాణ దిశ)** :మహనీయుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. గురువారం కాప్రా నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేతాజీ నగర్ పార్క్ లో స్వాతంత్ర సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలను ప్రతిష్టించు కోవడం, వారి ఆశయ సాధన కోసం కృషి చేయడం మన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.



ఎంతోమంది త్యాగ ఫలమే స్వతంత్ర భారతదేశమని, పరాయి పాలన నుంచి స్వాతంత్రాన్ని సాధించి పెట్టిన మహనీయుల చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. వారి ఆశయ సాధనకు అంకితభావంతో కృషి చేయాలని కోరారు. సుభాస్ చంద్ర బోస్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కనుకుల రజనీకాంత్ రెడ్డి, సుడుగు మహేందర్ రెడ్డి, ఏనుగు సీతారాం రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బైరి నవీన్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు ఇంద్రపాల్, వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యాష్ పాల్ గౌడ్, వనం మాణిక్యం, తుమ్మల మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ ఫేస్-3 పార్కును కాపాడాలి




**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18, (తెలంగాణ దిశ)** :నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ పేస్-3 లోని పార్క్ స్థలాన్ని కాపాడాలని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ గురువారం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రం అందించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ మేనేజర్కు వినతి పత్రాన్ని అందించారు. ప్రభుత్వం ఇల్లు లేని పేదల కొరకు వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోఇందిరమ్మ కాలనీ పేస్ 1,2,3 లలో అపార్ట్ మెంట్ నిర్మాణాలు చేసి లబ్ధిదారులకు ఇచ్చిందని గుర్తు




చేశారు. అయితే కాలనీవాసుల సౌలభ్యం కొరకు పార్కు స్థలాన్ని కేటాయించగా అధి కాస్త నేడు కబ్జాదారులు ఆ పార్కు స్థలాన్ని కబళించి ప్లాట్లు చేసి అమ్మడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని ఆయన మున్సిపల్ అధికారులకు వివరించారు. కాబట్టి పార్కు స్థలాన్ని అభివృద్ధి చేసి అందులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తే స్థానికులకు సౌకర్యవంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ ని కలిసిన వారిలో సిపిఐ నాయకులు ఆశి యాదయ్య, పొన్నెకంటి దస్తగిరి తదితరులు ఉన్నారు.

# ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను దసరా సెలవులలోపు తరలించాలి





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18, (తెలంగాణ దిశ)** :తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల భవన నిర్మాణ పనులు ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. గురువారం మేడ్చల్ మండలంలోని సోమవారం గ్రామంలో నిర్మిస్తున్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల భవన నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు ఎంత వరకు పూర్తయ్యాయని, ఇంకా ఎన్ని రోజులలో పూర్తవుతుందని, ఏ ఏ పనులు పెండింగ్ లో ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో అత్యవసరమైన నిర్మాణాలను ముందుగా పూర్తి చేయాలని సూచించారు. డార్మెంటరీ, తరగతి గదులు, కిచెన్, టాయిలెట్స్ వంటి వాటిని ముందుగా పూర్తి చేసుకుని వినియోగించుకోవాలని ఆదేశించారు. బోడుప్పల్ లో ప్రైవేటు బిల్డింగ్ లో నిర్వహిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను దసరా సెలవులలోపు తరలించాలని ఆర్ సిఓను ఆదేశించారు. నిర్మాణ పనులను చేపట్టాలని అత్యవసరమైన వాటిని ముందుగా పూర్తి చేసుకుని భవనాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. మొత్తం ఎంత మంది విద్యార్థులు ఉన్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదనంగా అవసరమైన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మార్వో భూపాల్, ఆర్ సిఓ నాగార్జున ప్రిన్సిపల్ మమత తదితరులు పాల్గొన్నారు.

# క్రీడారంగంలో రాణిస్తున్న "శ్రీ చైతన్య సిబిఎస్ఈ పాఠశాల" విద్యార్థులు

**హనుమకొండ, సెప్టెంబర్ 18, (తెలంగాణ దిశ)** :హనుమకొండ శ్రీ చైతన్య సిబిఎస్ఈ పాఠశాల విద్యార్థులు జెడ్ పి స్కూల్ లో జోనల్ స్థాయిలో ఎంపికయ్యారు. ఇందులో సీనియర్ విద్యార్థులు కిషోర్, జస్వంత్, జూనియర్స్ కోకో రిత్విక్ నవీన్, చంద్ర ,ధర్మ, నిఖిల్ ,సౌమ్య శ్రీ, కబడ్డీలో సంకీర్త, జూనియర్ వాలీబాల్ లో సాత్విక్, రేవంత్ సుకృత్, విశాల్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మీ మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడారంగంలో రాణిస్తున్న విద్యార్థులను ప్రశంసించారు. క్రీడా పోటీలలో క్రీడా స్ఫూర్తితో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిజియం



చేతన్, కో ఆర్డినేటర్స్ శివ కోటేశ్వరరావు, జోనల్ పిఈటి ప్రవీణ్, డీన్ కరుణాకర్, పిఈటి సంజు, సుష్మ తదితరులు పాల్గొన్నారు.


# సంపాదకీయం

## సైలెంట్‌గా అగ్రరాజ్యానికి షాక్!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50% సుంకాలు ఎగుమతి రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సుంకాలు భారత వస్త్రాలు, రసాయనాలు, ఆభరణాలు, ఆక్వా రంగాలపై గణనీయమైన ఒత్తిడిని తెచ్చాయి. అయినప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సుంకాలపై బహిరంగంగా స్పందించకుండా, నిశ్శబ్దంగా వ్యూహాత్మక చర్చలకు పరిమితమయ్యారు. మోదీ కాళ్లబేరానికి వస్తాడని భావించిన ట్రంప్‌కు భంగపాటే ఎదురైంది. ఇది భారత దీర్ఘకాలిక వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని గుర్తు చేసింది. భారత్ అమెరికా ఒత్తిడికి లొంగకుండా ఇతర దేశాలతో సంబంధాలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. దీంతో సైలెంట్‌గా అగ్రరాజ్యానికి షాక్ ఇవ్వబోతోంది. అగ్రరాజ్యానికి కోపం వస్తే చాలు ఒకప్పుడు ఇండియా ఇబ్బంది పడేది. అగ్రరాజ్యం ఇబ్బంది పడకుండా నడుచుకునేది. తన ఇబ్బంది పడినప్పటికీ అగ్రరాజ్యానికి ఏమీ కాకుండా చూసుకునేది. శ్వేత దేశం నుంచి అధ్యక్షుడు లేదా ఆ స్థాయి వ్యక్తులు వస్తే ఇండియాలో ఒక రకమైన వాతావరణం నెలకొనేది. అధ్యక్షుడి సేవలో తరించేందుకు మన దేశ వ్యవస్థలు పోటీపడేవి. రాష్ట్రపతి, ప్రధానమంత్రి.. ఇతర మంత్రులు వంగి వంగి సలాం చేసేవారు. అయితే ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. అగ్రరాజ్యం అంటే సులభంగా తీసుకునే స్థాయికి భారత్ వచ్చేసింది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు అయిన తర్వాత అగ్రరాజ్యం విధివిధానాలలో పూర్తిగా మార్పులు వచ్చాయి. ముఖ్యంగా వాణిజ్యం విషయంలో ట్రంప్ అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. భారత్ అంటే చాలు మండిపడుతున్నారు. టారిఫ్ ల శాతాన్ని పెంచుకుంటూ పోతున్నారు. మొదట్లో అమెరికా తీసుకుంటున్న నిర్ణయం వల్ల మనదేశంలో ఇబ్బందికరమైన వాతావరణం తలెత్తింది. అగ్రరాజ్యం విధిస్తున్న షరతులను భారత్ ఎలా తట్టుకుంటుంది అనే అనుమానం అందరిలోనూ మొదలైంది. అయినప్పటికీ భారత్ 7.8% వృద్ధిరేటును నమోదు చేయడం విశేషం. ఇదే విషయాన్ని సగర్వంగా భారత ప్రధాని ప్రపంచ వేదికల ముందు చెప్పడం గమనార్హం.. సెమికాన్ ఇండియా 2025 సదస్సులో భారత ప్రధాని చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాశంగా మారిపోయాయి. గ్లోబల్ పరంగా చూసుకుంటే ఒక రకమైన వాతావరణం ఉంది. కొనుగోలు శక్తి తగ్గిపోయింది. ఉత్పత్తి కూడా పడిపోయింది. నిరుద్యోగం తారస్థాయికి చేరుకుంది. ఇలాంటి స్థితిలో భారత్ సూపర్ వృద్ధిరేటును నమోదు చేయడం గొప్ప విషయమని భారత ప్రధాని పేర్కొన్నారు. కొంతమంది విచ్ఛిన్నకారులు ఆర్థికంగా ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించినప్పటికీ భారత్ స్థిరంగా నిలబడిందని ప్రధానమంత్రి కొనియాడారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా మైక్రో ప్రాసెసర్ చిప్ లను తయారుచేసి భారతదేశం ప్రపంచ దేశాలకు షాక్ ఇచ్చింది. భారతదేశం విక్రం 32 బిట్ ప్రాసెసర్, 4 చిప్స్ తయారు చేసింది. ఇది తొలి మైక్రో ప్రాసెసర్ చిప్.. దీనిని ఇస్రో సెమి కండక్టర్ ల్యాబ్ డెవలప్ చేసింది.. వాహక నౌకల్లో.. కఠినమైన పరిస్థితుల్లో పనిచేసే విధంగా దీనిని రూపొందించారు. సెమీ కండక్టర్ ఎకో సిస్టం ను ఇది పెంపొందిస్తుంది.. అయితే దీనిని కేవలం 3.5 సంవత్సరాల వ్యవధిలోనే భారత్ రూపొందించడం పట్ల ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఇక మన దేశంలో ఐదు సెమీ కండక్టర్ల నిర్మాణం అత్యంత వేగంగా జరుగుతోంది. దీనివల్ల టెక్నాలజీ మీద భారత్ మరింత గ్రిప్ సాధించనుంది. అగ్రరాజ్యం షరతులు విధించినప్పటికీ.. భారత్ ఏ మాత్రం భయపడలేదు. అంతే కాదు తన ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేసుకునే మార్గాలను సుగమం చేసుకుంది. అందువల్లే మోడీలో ఈ స్థాయిలో కాన్ఫిడెన్స్ పెరిగింది. అది భారతదేశాన్ని మరింత ఆర్థికంగా శక్తివంతంగా మార్చేందుకు సహకరిస్తోంది. శాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనడం, భారత్?చైనా సంబంధాల్లో కొత్త అధ్యాయాన్ని సూచిస్తుంది. 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత దెబ్బతిన్న భారత్?చైనా సంబంధాలు, ఇటీవలి కాలంలో స్థిరీకరణ దిశగా సాగుతున్నాయి. ఈ సమావేశంలో మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లు పరస్పర విశ్వాసం, ఆర్థిక సహకారం ఆధారంగా సంబంధాలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా, రెండు దేశాలు సరిహద్దు వివాదాలపై చర్చలను కొనసాగించడం, విమానాలు పునరుద్ధరించడం, వీసా నిబంధనలను సడలించడం వంటి చర్యలను చేపట్టాయి. ఈ చర్యలు ట్రంప్ సుంకాలకు ప్రతిస్పందనగా భారత వ్యూహాత్మక ఆలోచనను ప్రతిబింబిస్తాయి, ఇది అమెరికాపై ఆధారపడకుండా ఆసియా, ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్య సంబంధాలను విస్తరించే దిశగా సాగుతోంది. 2020 గల్వాన్ లోయ ఘర్షణలో భారత సైనికులు ప్రదర్శించిన పోరాట పటిమ చైనాకు భారత సైనిక సామర్థ్యాన్ని స్పష్టం చేసింది. గడ్డకట్టే చలిలోనూ భారత సైనికులు చూపిన ధైర్యం, చైనాతో సమాన స్థాయిలో చర్చలు జరిపేందుకు భారత్‌కు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఈ ఘటన తర్వాత, ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదాలపై చర్చలు కొనసాగుతున్నాయి, ఇవి శాంతి, స్థిరత్వాన్ని కాపాడే దిశగా ముందుకు సాగుతున్నాయి. ఈ సందర్భంలో, భారత్ తన సైనిక, ఆర్థిక శక్తిని ఉపయోగించి, చైనాతో సమతుల్య సంబంధాలను నిర్మించే ప్రయత్నంలో ఉంది, అదే సమయంలో అమెరికా ఒత్తిడిని తట్టుకుంటోంది. భారత్ తలొగ్గకపోవడంతో ట్రంప్ ఇప్పుడు మరో ఎత్తుగడ వేశారు. భారత్?ఇజ్రాయెల్ మధ్య ఆయుధ సాంకేతికత బదిలీని నియంత్రించాలని భావిస్తున్నప్పటికీ, భారత్ ఇప్పటికే ఇజ్రాయెల్ డ్రోన్‌లను ఆపరేషన్ సిందూర్ వంటి కార్యక్రమాల్లో విజయవంతంగా ఉపయోగించింది. ఇది భారత్ యొక్క సాంకేతిక సామర్థ్యాన్ని, ఇజ్రాయెల్‌తో బలమైన భాగస్వామ్యాన్ని సూచిస్తుంది. అదే విధంగా, ట్రంప్ యూరోపియన్ యూనియన్‌ను భారత్‌పై సుంకాలు విధించమని ప్రోత్సహిస్తున్నప్పటికీ, యురోపియన్ యూనియన్ దీనికి సుముఖంగా లేదు. 2002 గుజరాత్ అల్లర్ల తర్వాత అమెరికా, యురోపియన్ యూనియన్ ఆంక్షలు విధించినప్పటికీ, 2007లో యూరోపియన్ యూనియన్ ప్రతినిధులు గుజరాత్‌లో పర్యటించి, అమెరికా ఒత్తిడి లేకుండా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ప్రస్తుతం, రష్యా నుంచి దిగుమతి చేసుకున్న గ్యాస్‌ను భారత్ యురోపియన్ యూనియన్‌కు ఎగుమతి చేస్తోంది, ఇది యూరోపియన్ యూనియన్‌తో బలమైన వాణిజ్య సంబంధాలను సూచిస్తుంది. ఈ నేపథ్యంలో, ట్రంప్ సుంకాల వ్యూహం యూరోపియన్ యూనియన్‌పై ప్రభావం చూపే అవకాశం తక్కువ. భారత్ గతంలో 1998 అణు పరీక్షల తర్వాత, 2002 గుజరాత్ అల్లర్ల తర్వాత అమెరికా, యూరోపియన్ యూనియన్ ఆంక్షలను ఎదుర్కొంది. అయినప్పటికీ, ఈ ఆంక్షలను అధిగమించి, 2014లో అమెరికా మోదీని రెడ్ కార్పెట్‌తో స్వాగతించింది. ఈ చరిత్ర భారత్ విదేశీ ఒత్తిళ్లను తట్టుకునే సామర్థ్యాన్ని చూపిస్తుంది. ప్రస్తుత ట్రంప్ సుంకాల సవాల్‌ను కూడా భారత్ వ్యూహాత్మకంగా ఎదుర్కొంటోంది. ఎస్‌సీవో సమావేశంలో చైనాతో సంబంధాలను బలోపేతం చేయడం, ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్యాన్ని విస్తరించడం, ఇజ్రాయెల్, యూరోపియన్ యూనియన్‌లతో సహకారాన్ని కొనసాగించడం ద్వారా భారత్ తన స్వయంప్రతిపత్తిని నిరూపిస్తోంది

# బాచుపల్లి కోమటికుంటను ఆక్రమించిన వాసవి నిర్మాణ సంస్థపై హైడ్రాలో ఫిర్యాదు





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18, (తెలంగాణ దిశ)** :నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి లోని కోమటికుంట ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్లో వాసవి నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న కట్టడాలను వెంటనే తొలగించాలని నిజాంపేటకు చెందిన పలువురు గురువారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వాసవి నిర్మాణ సంస్థ వారు నిర్మిస్తున్న 8,9 బ్లాకు నిర్మాణాలు కోమటికుంట చెరువు ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ లోకి వస్తాయని వారు హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు సంబంధిత పత్రాలను అందజేశారు. చెరువు ఆక్రమణలపై హైకోర్టు ఉత్తర్వుల డబ్ల్యూ పి (35954/2024) ప్రకారం రికార్డులన్నీ పరిశీలించి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా ఆధ్వర్యంలో సర్వే చేసి చర్యలు తీసుకోవాలని హైకోర్టు సూచించిదని వారు కమిషనర్ రంగనాథ్ కు వివరించారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం పూర్తి ఆధారాలను ఆకుల సతీష్ హైడ్రా అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ 2022 నుండి వాసవి నిర్మాణ సంస్థ బాచుపల్లి కోమటికుంట చెరువు ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ నందు అక్రమ నిర్మాణాలు చేయడంపై రెండు ఎఫ్ఐఆర్లు అయినా ఆ సంస్థ తమ నిర్మాణ పనులను కొనసాగిస్తుందని అన్నారు. తగిన చర్యలు తీసుకోవాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సహకరించక పోవడంతో హైకోర్టులో పిల్ వేయవలసి వచ్చిందని హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైడ్రా, రెవెన్యూ పాటించి సంయుక్త సర్వే చేసి బ్లాక్ నెంబర్లు 8, 9 ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్లో ఉన్న విషయం నిర్ధారించుకొని వాటిని తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ హైడ్రా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి జాయింట్ సర్వే చేసి ఆరోపణలు వస్తున్న వాసవి నిర్మాణ సంస్థ ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్లో నిర్మాణాలు కొనసాగిస్తున్నట్లయితే తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. హైడ్రా కమిషనర్ ని కలిసిన వారిలో శ్రీనివాస్ గౌడ్, చంద్రశేఖర్, అరుణ్ రావు తదితరులు ఉన్నారు.


# బిజెపి ఓబిసి మోర్చా ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18, (తెలంగాణ దిశ)** :భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజాంపేట మల్లికార్జున టెంపుల్ లో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ ఎన్ఎంసి కన్వీనర్ జక్కుల రవి యాదవ్, సహ కన్వీనర్స్ గోపతి సురేష్ వేణుమాధవ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి స్వచ్ఛభారత్ యొక్క విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి అధ్యక్షులు బిక్షపతి యాదవ్, నరేంద్ర చౌదరి, సీనియర్ నాయకులు సుమన్ రావు, నరసింహారెడ్డి, రాజిరెడ్డి, శిల్పారెడ్డి, సత్యనారాయణ, పద్మ ప్రసాద్, నారాయణమూర్తి, నరసింహారెడ్డి, సురేష్, అశోక్ నాయక్,సాయి కృష్ణారెడ్డి, కార్తీక్ భూపాల్ సత్యా ప్రహ్లాద్, భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా స్వచ్ఛ భారత్ కన్వీనర్ రవి యాదవ్, సహ – కన్వీనర్లుగా వ్యవహరించిన సురేష్ గోపతి, వేణు మాధవ్ తదితరులతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులను సన్మానించారు.

# గులాబీ ఓటమే లక్ష్యమా?



**హైదరాబాద్, తెలంగాణ దిశ :** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కల్వకుంట్ల కవిత ఎపిసోడ్.. ఉత్కంఠ రేపుతోంది. కవిత పార్టీ గీత దాటిందని పేర్కొన్న బీఆర్ఎస్.. ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు సంచలన ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు కవిత ఏం చేస్తారనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ సస్పెండ్ చేయడంతో.. ఆమె తర్వాతి అడుగులు ఎటు వైపు అనే చర్చ జోరందుకుంది. సొంత పార్టీపై, నేతలపై విమర్శలు గుప్పించిన కవిత.. ఏం సాధించారు.. ఏం సాధించాలని అనుకుంటున్నారు? బీఆర్ఎస్ పార్టీలో గత కొంతకాలంగా ధిక్కార స్వరం వినిపిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఎట్టకేలకు వేటుపడింది. పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు, విధానాలు ఎవరు అవలంభించినా.. వారిపై కఠిన చర్యలు తప్పవని గతంలో ఓ సందర్భంలో గులాబీ బాస్ కేసీఆర్ మీడియా ముందే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అయితే గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న కవితపై.. ఇన్ని రోజులుగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో.. ఆమె కేసీఆర్ కుమార్తె కావడం వల్లే.. వదిలేస్తున్నారనే వాదనలు వినిపించాయి. ఇప్పుడు ఏకంగా హరీష్ రావు, సంతోష్ రావు లాంటి సీనియర్ నేతలు, కేసీఆర్ కుటుంబ సభ్యులపైనా కవిత సంచలన ఆరోపణలు చేయడం సర్వత్రా ఉత్కంఠకు తెరలేపింది. అయితే ఇప్పటికి కూడా కవిత తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కోసమే తన పోరాటం అంటూ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్న వేళ.. కల్వకుంట్ల కవిత తదుపరి నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. ఆమె పార్టీ సభ్యత్వాని కి, ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేసే అవకాశాలు కనిపిస్తు న్నాయి. అయితే గత కొంతకాలంగా గులాబీ పార్టీపై విరుచుకుప డుతూ.. సొంతంగా జాగృతి నేతలతో ఆందోళనలు, నిరసనలు, ప్రకటనలు చేస్తున్న కవిత.. పార్టీలో తాను ఇమడలేకపోతున్నానం టూ పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. ఈ క్రమంలోనే విమర్శలను తీవ్రతరం చేసి.. తాను పార్టీని విడిచిపెట్టడం కాకుండా.. పార్టీయే తనపై వేటు వేసేలా చేసుకున్నారనే చర్చ జరుగుతోంది. ఏది ఏమైనా పార్టీ నుంచి బయటికి వెళ్లాలన్న తన ప్రయత్నంలో ఆమె సక్సెస్ అయిందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పార్టీ సస్పెండ్ చేసిన నేపథ్యంలో ఇప్పుడు కవిత నిర్ణయం ఏంటి అనేది యావత్ తెలంగాణ సమాజం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. ఆమె కొత్తగా పార్టీ పెడతారా లేక ఇతర పార్టీల్లోకి వెళ్తారా అనే చర్చ జరుగుతోంది. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్న కాంగ్రెస్, బీజేపీలపై కవిత గత కొన్నేళ్లుగా తీవ్ర విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమె వేరే పార్టీల్లోకి వెళ్లే ప్రసక్తిలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇప్పటికే తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలుగా ఉన్న కల్వకుంట్ల కవిత సొంతంగా పార్టీ పెట్టే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని పేర్కొంటున్నారు. అదే జరిగితే తెలంగాణ గడ్డపై మరో కొత్త పార్టీ అవతరించనుందనే వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు.. బీఆర్ఎస్‌లో ఉండగానే సొంత పార్టీపై బహిరంగంగానే విమర్శలు గుప్పించిన కవిత.. పార్టీ నుంచి బయటికి వెళ్లిన తర్వాత ఆ డోసు మరింత పెంచే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మొదట జగదీష్ రెడ్డి, ఆ తర్వాత హరీష్ రావు, సంతోష్ రావులపై విమర్శలు చేసిన కవిత.. ఆ తర్వాత ఎవరిని టార్గెట్ చేస్తారోననే ఉత్కంఠ నెలకొంది. ఇక పార్టీ నుంచి బయటికి వచ్చిన తర్వాత ఆమె లక్ష్యం ఏంటి అనే ప్రశ్నలు కూడా వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్‌పై ఇప్పటికే తీవ్ర విమర్శలు చేస్తున్న కవిత.. ఇకపై మరింత ఎక్కువగా ఆ పార్టీని టార్గెట్ చేసుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాను అధికారంలోకి రాలేకపోవచ్చు, కానీ తాను టార్గెట్ చేసిన వాళ్లను కూడా అధికారంలోకి రాకుండా చూడాలనే పంతంతో కవిత పని చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి కవిత సస్పెండ్ కావడం ఇప్పుడు ఎవరికి లాభం అనే చర్చ కూడా ప్రస్తుతం తెలంగాణలో జరుగుతోంది. కవిత ఎపిసోడ్ కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీకి నష్టం చేకూరుస్తుందని, విపక్ష ఓటు బ్యాంకు చీలిపోవడం కాంగ్రెస్ పార్టీకి కలిసొస్తుందని రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ అంచనా వేస్తున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీ ఓటు బ్యాంక్‌ను కవిత ఎంత మేర చీల్చగలరనే ప్రశ్న కూడా తలెత్తుతో ంది. కేసీఆర్ నీడ నుంచి బయటకొచ్చిన కవితతన ఉనికిని నిలబెట్టుకోవడం అంత ఈజీ కాదనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే ఇక మీదట కవిత వేయబోయే ప్రతి అడుగు బీఆర్ఎస్‌ను దెబ్బతీసే దిశగానే ఉంటుందని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరకుండా చేయడమే ఆమె అంతిమ లక్ష్యం కావొచ్చని కూడారాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే రాజకీయాలు చాలా వేగంగా మారుతుంటాయి.

# బాచుపల్లి బైరాన్ చెరువు పరిసర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - కాంగ్రెస్ పార్టీ ఎన్ఎంసి ప్రధాన కార్యదర్శి కొలను జీవన్ రెడ్డి





కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18, (తెలంగాణ దిశ) :నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి బైరన్ చెరువుకి భారీగా వరద నీరు చేరుతున్నందున సమీప ప్రజలు అప్రమత్తంగాఉండాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొలన్ జీవన్ రెడ్డి స్థానికులకుసూచించారు. గురువారం ఆయన బైరాన్ చెరువు సమీపంలో నివసిస్తున్న వారిని పరామర్శించి వారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే స్థానిక పరిస్థితిని బట్టి నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, హైడ్రా కంట్రోల్ రూమ్ కు ఫోన్ లో సమాచారం అందించారు. బైరాన్ చెరువు సమీపంలో నివసిస్తున్న పేదలను తాత్కాలికంగా సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించాలని ఆయన మున్సిపల్, హైడ్రా అధికారులను అభ్యర్థించారు. కొలన్ జీవన్ రెడ్డి వెంట స్థానిక నేతలు కొలను బాల్రెడ్డి, గొంగుల జిత్తు తదితరులు ఉన్నారు.

# మల్లాపూర్ లో రూ. 10 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులు


## - కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్






**మల్లాపూర్, సెప్టెంబర్ 18, (తెలంగాణ దిశ)** :"బస్తీ బాట" కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్ జామా మస్జీద్ వద్ద గత పది సంవత్సరాల నుండి అపరిష్కృతంగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. సుప్రీమ్ టైలర్స్ నుండి జమ మస్జీద్ ముందుగా స్ట్రీట్ నెంబర్ 6 లోని నూతన బాక్స్ డ్రైన్ వరకు రూ. 10 లక్షల వ్యయంతో నూతన భూగర్భ డ్రైనేజీ పనులు అతిత్వరలో ప్రారంభం కానున్నట్లు కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుండి అపరిష్కృతంగా ఉన్న సమస్య కాంగ్రెస్ ప్రభుత్వంలో పరిష్కారం అవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పిఎస్ఎన్. చౌదరి, ఎండి. మన్నన్, ఎండి. పాషా, ఎండి. రషీద్, యాదగిరి, శ్రీశైలం, వెంకటేష్ గౌడ్, ఎండి. నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవ వేడుకలు






**నాగారం, సెప్టెంబర్ 18, (తెలంగాణ దిశ)** :నాగారం మున్సిపాలిటీ పరిధిలోని గోకుల్ కృష్ణ కాలనీలో ప్రపంచ వెదురు దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్ గౌడ్, అనంతరెడ్డి, అన్నం రాజు సురేష్, మాజీ వార్డు సాయినాథ్ గౌడ్, నిమ్మల శీను,తెల్ల శ్రీధర్, రవీందర్ రెడ్డి, మేదరి మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరికలు





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18, (తెలంగాణ దిశ) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ వాసులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహిళా కాంగ్రెస్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కడియాల ఇందిరా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమమే ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. అదే విధంగా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ప్రతి తెల్ల కార్డు దారునికి కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని గుర్తు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రేషన్ కార్డుల పంపిణీ, కార్యక్రమం గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజా ప్రభుత్వం పేద ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనలో తాను ఎల్లప్పుడు ముందు ఉంటానని హన్మంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు ధమని శ్రావణ్ కుమార్, కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ టి లక్ష్మారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రషీద్, సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రావు, రంగయ్య, ప్రశాంత్ రెడ్డి, అది రెడ్డి, సోమనాథ్, దుండిగల్ మున్సిపాలిటీ మైనారిటీ అధ్యక్షులు ఎండి. నయీమ్, కుత్బుల్లాపూర్ లేబర్ సెల్ ఉపాధ్యక్షులు చెవిటి శ్రీనివాస్, గిరిజారాణి, శ్రీదేవి, నల్లపు శిరీష, కర్రి రాధిక, మౌనిక, శిల్ప, కృష్ణవేణి, మాధురి, కృష్ణమ్మ, సంగీత, వినోద, లక్ష్మి, రేణుక, ఏ నీలమ్మ, దేవి, క్రాంతి, నాగరాణి, పి. కనకదుర్గ, హెచ్. చంద్రమ్మ, జి. సుగుణ, సిహెచ్.సంధ్య, ఎం.అరుణ, ఎం. విజయ, జి.శ్రద్ధ, జి కౌసల్య, ఎం నీలిమ,బి. అమ్ములు, జిసుజాత, వి.ఆశ, జి. సునీత, జి కమల,జి.స్వర్ణ, జి. బేబీ, పి. తులసి, బి. చిన్నారి, సత్యవతి, పి. రమేష్, జి. హుస్సేన్, బి.సంపత్, జి. రమేష్, ఆర్. కుమారస్వామి, బి. సంతోష్, బి. సుమన్, జి. భోగ్య, జి. విందు శేఖర్, జి. సుమన్, చంద్రయ్య, బి. సతీష్, జి. రమేష్, జి. కవిత, మనీ, బి. మమత తదితరులు పాల్గొన్నారు.

గాజాలో కరువు రక్కసి బారిన

# చిన్నారులు !

-పోషకాహార లోపంతో కృంగి కృశిస్తున్న బాలలు

-90మంది పిల్లలతో సహా 159మంది మృతి



గాజా : గాజాలో గత 24గంటల్లో ఇజ్రాయిల్ దాడుల్లో 111మంది పాలస్తీనియన్లు మరణించారు. 820మందికిపైగా గాయపడ్డారు. వీరిలో 91మంది ఆహార పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన దాడుల్లో మరణించిన వారేనని ఆరోగ్య మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. గురువారం ఆకలి దప్పులతో ఇద్దరు పిల్లలు మరణించారని వైద్య వర్గాలు తెలిపాయి.దీంతో ఇప్పటివరకుకరువుకాటకాలతో మరణించిన వారి సంఖ్య 159కి చేరింది. వీరిలో 90మంది పిల్లలే వున్నారు. గాజాలో కొత్తగా జన్మిస్తున్న పిల్లలందరూ తక్కువ బరువుతో వుంటు న్నారని, పోషకాహార లోపంవల్ల వారు సరిగా ఎదగడం లేదని ఆస్పత్రి వర్గాలు చెప్పాయి. ఇటువంటి ఆందోళనకర పరిస్థితుల్లో గాజాలోకి ప్రతిరోజూ వందలాదిగా ఆహార ట్రక్కులు రావాలని ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ) ప్రతినిధి అద్నన్ అబూ హస్నా పేర్కొన్నారు. కాల్పుల విరమణ జరిగితేనే గాజాలో మానవతా సంక్షోభం పరిష్కారమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. గాజా ప్రజలకు ఆహారం అందాలంటే ఆహార ట్రక్కులు కూడా సురక్షి తంగా చేరాలని, అందుకు ఇజ్రాయిల్ సహకరించాలని అన్నారు. గాజాకు అందే ఆహార సాయం ముందుగా ఐక్యరాజ్య సమితి గిడ్డంగులకు చేరితే, అక్కడ నుండి పంపిణీ కేంద్రాల వద్దకు చేరుతుందని అన్నారు. గాజాలో మంచినీటి శుద్ధి కేంద్రాలను నాశనం చేశారు. దీంతో తాగు నీరు కలుషితమై వ్యాధులు వ్యాపిస్తున్నాయి.

# పిల్లల స్కూల్లోనే అమ్మలకూ పాఠాలు..



ఒక్కోసారి చిన్న చిన్న ప్రయత్నాలే గొప్ప స్ఫూర్తిని ఇస్తాయి. కేరళ పాలక్కడ్‌లోని ఓ బధిర ప్రభుత్వ పాఠశాలలో ఈ ఏడాది తీసుకున్న ఓ వినూత్న నిర్ణయం ఆ బడి పిల్లలనే కాక, వారి తల్లులకు కూడా గొప్ప ప్రోత్సాహంగా నిలిచింది. ఒట్టపాలెం బధిర ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో వివిధ తరగతులకు చెందిన 50 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ ఏడాది ఈ పిల్లలు ధరించిన యూనిఫామ్స్ వాళ్ల తల్లులే కుట్టేలా పాఠశాల యాజమాన్యం వీలు కల్పించింది. 'ధనిమా ప్రొడక్షన్ సెంటర్' పేరుతో స్కూల్లో చిన్న టైలరింగ్ యూనిట్‌ని నెలకొల్పారు. దీనిద్వారా విద్యార్థులతో పాటు వారి తల్లులు కూడా సాధికారత సాధించేలా చేశారు. ఈ అంశంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మినికుమారి ఇలా చెప్పారు. 'మా స్కూలు విద్యార్థులు వారికున్న ప్రత్యేక అవసరాల దృష్ట్యా ఎకడమిక్ అంశాలపై, భాషలపై, జీవన నైపుణ్యాలపై పట్టు సాధించేందుకు ఎక్కువ సమయం తీసుకుంటారు. అయినా సరే ఇప్పటివరకు ఇక్కడ విద్యనభ్యసించి వెళ్లిన వారిలో చాలామంది ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉపాధి పొందారు. అయితే ఈ ఏడాది మేము ఇంకా అదనపు ప్రయోజనాలు ఈ పిల్లలకి కల్పించాలని అనుకున్నాం. అందులో భాగంగానే టైలరింగ్ యూనిట్ స్థాపించాం. ఆ తరువాత ఇందులో విద్యార్థుల తల్లులను కూడా భాగస్వామ్యం చెయ్యాలని ఆశించాం. ఇప్పుడు మా లక్ష్యం నెరవేరింది. తల్లులు, పిల్లలు ఒకేచోట జీవితనైపుణ్యాలను నేర్చుకుంటున్నారు' అని మినికుమారి నవ్వుతూ చెప్పారు.

టైలరింగ్ యూనిట్ నిర్వాహకురాలు సుజితా మాట్లాడుతూ, 'ఇక్కడ దుస్తులు కుట్టడం నేర్చుకున్న విద్యార్థినుల తల్లులతోనే వారి పిల్లలకు యూనిఫామ్‌లు కుట్టించడం మా ప్రయత్నంలో సాధించిన మొదటి విజయం. ఇప్పుడు ఈ కుట్టు మిషన్ కేంద్రంలో ఆరుగురు తల్లులు పూర్తికాలం పనిచేస్తున్నారు. వీరిలో మొదటిసారి సూది, దారం పట్టుకున్న వారు కూడా ఉన్నారు. అరకొరా పనులు చేసి ఇళ్ల దగ్గర సంపాదించే సొమ్ము కన్నా ఇక్కడ దుస్తులు కుట్టడం వల్ల ఎక్కువ సంపాదించేలా కూడా మేం చర్యలు తీసుకున్నాం' అని ఆమె చెప్పారు. శిక్షణా కేంద్రంలో పనిచేస్తున్న సలీనా తన అనుభవాలను ఇలా చెప్పారు. 'ఇక్కడ మాకు యూనిఫామ్‌లతో పాటు, క్లాత్ బ్యాగ్‌లు, పర్సులు, పేపర్ ఫైల్స్, హ్యాండీక్రాఫ్ట్స్, ఫ్యాన్సీ ఐటమ్స్ వంటి వాటి తయారీలో కూడా శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు కూడా మాకు చేదోడుగా నిలుస్తాయని ఆశిస్తున్నాం' అంటున్న సలీనా, 8వ తరగతి చదువుతున్న మహ్మద్ మున్నావర్ తల్లి. ప్రతిరోజూ ఇంటి నుండి 70 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మరీ ఆమె ఇక్కడికి చేరుకుంటుంది. కొడుకుతో కలిసి స్కూలుకు రావడం, వెళ్లడం ఇప్పుడు ఆమె దినచర్యగా మారిపోయింది. మున్నావర్ లాంటి పిల్లల చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు స్కూలు క్యాంపస్‌లో ఆడియాలజీ ల్యాబ్, స్పీచ్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, ఇంటరాక్టివ్ స్పీచ్ ప్యానెల్, కంప్యూటర్ ల్యాబ్, పిల్లల పార్కు, ఆటస్థలం, హాస్టల్ వంటి సౌకర్యాలన్నీ ఈ స్కూల్లో ఉన్నాయి. ప్రత్యేక స్కూళ్లపై కేరళ రాష్ట్రం పెట్టిన ఈ శ్రద్ధ, ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా ఉంది. అలాగే ప్రత్యేక అవసరాలు గల పిల్లలతో పాటు వారి తల్లుల పట్ల కూడా ఇంత ప్రత్యేక శ్రద్ధ పెట్టిన ఈ స్కూలు నిర్వాహకులను కూడా ప్రశంసించకుండా ఉండలేం.

ఆయుర్వేద బిజినెస్ లోకి

# రిలయన్స్





ముంబై,: లయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ ఇప్పుడు ఆయుర్వేదంలోకి అడుగుపెట్టారు. రిలయన్స్ రిటైల్-లింక్డ్ బ్యూటీ ప్లాట్‌ఫామ్ 'తిరా' కొత్త బ్యూటీ బ్రాండ్‌ను ప్రారంభించింది. ఈ బ్రాండ్ పేరు పురవేద. ఈ బ్రాండ్ ఆయుర్వేదం ఆధారంగా రూపొందించారు. పురవేద నాలుగు విభిన్న శ్రేణులతో ప్రారంభమైంది. కంపెనీ ఈ చర్య బాబా రాందేవ్ కంపెనీ పతంజలితో సహా అనేక ఆయుర్వేద కంపెనీలతో పోటీపడుతుంది. ఈ బ్రాండ్ ద్వారా, తిరా వినియోగదారులకు ఉత్తమ సౌందర్య ఉత్పత్తులను అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది.తిరా సహ వ్యవస్థాపకురాలు, అఞా భక్తి మోడీ లాంచ్ సందర్భంగా మాట్లాడుతూ.. 'పురవేదను ప్రారంభించడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఈ బ్రాండ్ భారతదేశ వారసత్వం, ఆవిష్కరణల మిశ్రమం. తిరాలో అందానికి అతీతంగా, స్వీయ సంరక్షణకు ప్రజలను ప్రేరేపించే బ్రాండ్‌లను ముందుకు తీసుకురావాలనుకుంటున్నాము. అని అన్నారు.పురవేద ఉత్పత్తులు సాంప్రదాయకమైనవి కానీ ఆధునిక పద్ధతిలో తయారు చేస్తారు. ఈ బ్రాండ్‌లో చర్మ సంరక్షణ , జుట్టు సంరక్షణ, శరీర సంరక్షణ ఉత్పత్తులు ఉన్నాయి. కంపెనీ మొత్తం 50 కంటే ఎక్కువ ఉత్పత్తులతో ప్రారంభమైంది. ఈ ఉత్పత్తులను నాలుగు వేర్వేరు శ్రేణులుగా విభజించారు. ఈ శ్రేణుల పేర్లు ధర, నియమం, సామ, ఉర్జా. వివిధ శ్రేణులలో వేర్వేరు పదార్థాలు ఉపయోగించారు. పురవేద ఉత్పత్తులను తిరా దుకాణాలు, తిరా వెబ్‌సైట్ నుండి కొనుగోలు చేయవచ్చు.రిలయన్స్ రిటైల్ 2023 సంవత్సరంలో తీరాను ప్రారంభించింది. తీరా భారతదేశంలోని 98% కంటే ఎక్కువ పిన్ కోడ్‌లకు డెలివరీ చేస్తుంది. దీనికి అనేక నగరాల్లో స్టోర్‌లు కూడా ఉన్నాయి. దీని ఉత్పత్తులను స్టోర్ నుండి లేదా తీరా వెబ్‌సైట్ నుండి కొనుగోలు చేయవచ్చు.

# మర్రిగూడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సస్పెండ్



మర్రిగూడ: మర్రిగూడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివ స్వరూప రాణిని సస్పెన్షన్ చేస్తూ రాష్ట్ర మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆచారి గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపాల్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ మంజూరైన నిధులలో అవకతవకలకు పాల్పడిందని ఆరోపిస్తూ తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలసుకు పూర్తి ఆధారాలతో పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు గత రెండు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. అలాగే జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో పాటు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి డీఈవో బిక్షపతి కి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గత సోమవారం డిడి దుర్గాప్రసాద్ విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు విచారణ నివేదికను అందజేశారు. ఈ మేరకు నిధులలో ప్రిన్సిపాల్ అవినీతికి పాల్పడిందని రుజువు చేస్తూ శివస్వరూపురానిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# వడివడిగా నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు




**ఒంగోలు, తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్‌లో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లాలో కనిగిరి వరకు ట్రాక్ నిర్మాణం దాదాపు పూర్తయింది. దర్శి రైల్వే స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఏడాదిలోనే ఈ స్టేషన్ మీదుగా రైలు పరుగులు తీయనుంది. ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుండి తిరుపతి, చెన్నై వెళ్లడం సులువు అవుతుంది. పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల స్వప్నం నెరవేరనుంది. ఆంధ్రప్రదే శ్‌లో కీలకమైన రైల్వే లైన్ నిర్మాణ పనులు మరింత వేగవంతం అయ్యాయి. హైదరాబాద్ వైపు నుంచి ఏపీకి కీలకమైన నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులు ప్రకాశం జిల్లాలో కొనసాగుతున్నాయి. కనిగిరి వరకు ట్రాక్ నిర్మాణ పనులు ప్రస్తుతం ట్రాక్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.. అలాగే రైల్వే స్టేషన్‌ల పనులు చేపట్టారు. ఈ మార్గంలో దర్శి రైల్వే స్టేషన్ పనులు దాదాపుగా పూర్తికాగా.. మెయిన్ రైల్వే ట్రాక్ పనులు పూర్తి చేశారు. లూప్‌లైన్ మూడు ట్రాక్ పనులు కూడా ముగింపులో ఉన్నాయి. ప్రస్తుతం దర్శి రైల్వే స్టేషన్‌లో టికెట్ కౌంటర్‌తో పాటుగా ప్రయాణికులు కూర్చోవడానికి సౌకర్యంగా బల్లలు, తాగునీరు కోసం ఏర్పాట్లు చేసి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. అధికారులకు సంబంధించి గెస్ట్ హౌస్, సిగ్నల్ ఆఫీస్ పనులు ముగించారు.దర్శి రైల్వే స్టేషన్ బయట, లోపల లైట్లు ఏర్పాటు చేస్తున్నారు.. స్టేషన్ బయట గ్రీనరీ ఉండేలా చక్కగా మొక్కలు నాటారు. 90శాతం వరకు పనులు పూర్తయ్యాయని.. మిగిలిన పనుల్ని త్వరలోనే పూర్తి చేస్తామంటున్నారు అధికారులు. ఇప్పటికే ప్యాసింజర్ రైలుతో ట్రయల్ రన్ నిర్వహించామని.. ఈ ఏడాదిలో దర్శి రైల్వే స్టేషన్ మీదుగా రైలు పరుగులు తీయడం ఖాయం అంటున్నారు. అయితే ప్రస్తుతం హైదరాబాద్ నుంచి తిరుపతి, చెన్నై వెళ్లాలంటే మూడు రైలు మార్గాలు ఉన్నాయి. ఈ రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే కనుక.. హైదరాబాద్ వైపు నుంచి తిరుపతి, చెన్నై వైపు చాలా త్వరగా వెళ్లొచ్చు అంటున్నారు.నడికుడి నుంచి శ్రీకాళహస్తి వరకు 309 కిలోమీటర్లు ఉన్న ఈ రైల్వే లైన్ పనుల్ని ఐదు దశలుగా చేపట్టేందుకు ప్లాన్ చేశారు. ప్రకాశం జిల్లాలో మూడు, నాలుగు దశల్లో ఈ పనులు కొనసాగుతున్నాయి. ఈ ట్రాక్ నిర్మాణం ప్రకాశం జిల్లాలోని పొదిలి సమీపంలో గార్లపేట వరకు (145 కిలోమీటర్లు) వరకు దాదాపుగా పూర్తయ్యింది.. కేవలం 200 మీటర్లు మాత్రమే మిగిలి ఉంది. ప్రస్తుతం కనిగిరి వైపుగా ట్రాక్ నిర్మాణ పనులు వేగవంతం చేశారు. అలాగే పొదిలి, గార్లపేట, కనిగిరి, గౌతువారిపల్లి రైల్వే స్టేషన్ పనులు కూడా ముగింపు దశకు వచ్చాయి.పేరంగుడిపల్లి దగ్గర ఈ రైల్వే లైన్‌కు సంబంధించిన బ్రిడ్జి నిర్మాణం మాత్రం.. నేషనల్ హైవే పనులు పూర్తయ్యాకే చేపడతాము అంటున్నారు. ఇక కనిగిరి నుంచి పామూరు మధ్యలో రైల్వే లైన్ పనుల కోసం టెండర్లు పూర్తి చేశారు.. త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశం ఉందంటున్నారు.నడికుడి నుంచి శ్రీకాళహస్తి రైల్వే లైన్ కోసం పశ్చిమ ప్రకాశం జిల్లావాసులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా దర్శి, పొదిలి, కనిగిరి ప్రాంతానికి చెందినవారు ఈ రైల్వే లైన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాదిన్నరగా ఈ రైల్వే లైన్ పనులు వేగవంతం చేశారు.. అలాగే పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తిచేసి పనుల్ని మరింత వేగవంతం చేశారు. అన్ని కుదిరితే ఈ ఏడాది దర్శి, పొదిలి మీదుగా కనిగిరి వరకు రైలు పరుగులు తీయడం ఖాయం అంటున్నారు.

## మర్రిగూడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సస్పెండ్

**మర్రిగూడ, తెలంగాణ దిశ :** మర్రిగూడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివ స్వరూప రాణి ని సస్పెన్షన్ చేస్తూ రాష్ట్ర మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆచారి గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపాల్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ మంజూరైన నిధులలో అవకతవకలకు పాల్పడిందని ఆరోపిస్తూ తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలసుకు పూర్తి ఆధారాలతో పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు గత రెండు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. అలాగే జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో పాటు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి డీఈవో బిక్షపతి కి ఫిర్యాదుచేశారు. ఈమేరకు గత డిడి దుర్గాప్రసాద్ విచారణ నిర్వహి ంచి ఉన్నతాధికారులకు విచారణ నివేదికను అందజేశారు. ఈ మేరకు నిధులలో ప్రిన్సిపాల్ అవినీతికి పాల్పడిందని రుజువు చేస్తూ శివస్వరూపురానిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సైబర్ నేరాల విశ్వరూపం..

# 8 సెకన్లకు ఒక నేరం



ఢిల్లీ,: ఎనిమిది సెకన్లు అంటే ఎనిమిది సెకన్లు. మరింత వివరంగా చెప్పాలంటే.. ఇప్పుడు మీరు ఈ వార్తను చదవటం మొదలు పెట్టి దగ్గర దగ్గర 8 సెకన్లు పడుతుంది. ఇంత స్వల్ప వ్యవధిలో దేశంలో ఒకరు సైబర్ నేరానికి బాధితులుగా మారిపోయి ఉంటారు. సైబర్ నేరాల తీవ్రత ఎంత ఎక్కువ ఉందన్న దానికి ఇదో నిదర్శనంగా చెప్పాలి. 2023తో పోలిస్తే 2024లో సైబర్ నేరాల తీవ్రత ఏకంగా 209 శాతం పెరిగిన వైనాన్ని తాజాగా విడుదలైన నివేదిక వెల్లడించింది. గత ఏడాది అంటే 2024లో సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన మొత్తం ఎంతో తెలుసా? అక్షరాల రూ.22,854 కోట్లు. ఇంత భారీగా సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్న వేళ.. వారికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది. సైబర్ నేరగాళ్లు విసిరే ఉచ్చుల్లో ఇట్టే చిక్కుకుంటున్న బాధితులు లబోదిబోమంటున్నారు. తమ జీవిత కాలం కష్టపడి సంపాదించిన మొత్తాల్ని ఇట్టే పోగొట్టుకుంటున్నారు. అమెరికన్స్ కోసం కాదా? అత్యాశ..అమాయకత్వం.. అవగాహన లేకపోవటం.. అనవసర భయాందోళనలకు గురి కావటం లాంటి వాటితో సైబర్ నేరగాళ్లకు దొరికిపోతున్నారు. 2024లో దాదాపు 36 లక్షల మంది మోసపూరిత లింక్ ను తెరవటం.. మోసగాళ్ల ఫోన్ కాల్స్ కు స్పందించటం ద్వారా భారీగా డబ్బులు పోగొట్టుకున్నారు. సైబర్ నేరగాళ్లను కట్టడి చేసే క్రమంలో కేంద్ర ప్రభుత్వం 9.42 లక్షల సిమ్ కార్డుల్ని.. 2.63 లక్షల ఎంఐ నెంబర్లను బ్లాక్ చేసింది. వివిధ బ్యాంకుల్లో సైబర్ నేరగాళ్లకు సంబంధించిన 24 లక్షల తప్పుడు బ్యాంకుఖాతాల్ని గుర్తించి ఫ్రీజ్ చేసింది.గత ఏడాది 10,599 మందిసైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు.అయినప్పటికి భారీ ఎత్తున సైబర్ నేరాలకు పాల్పడుతున్న వైనాన్ని చూస్తే.. ప్రజలు మరింత అప్రమత్తంగాఉండటం అవసరం. ఎవరో ఏదో భయపెట్టారని.. టెన్షన్ కు గురి చేశారని ఆగం కాకుండా ఉండటం చాలా అవసరం.

వానాకాలం ఆ సమస్యలు వేధిస్తున్నాయా..

# వేపతో చక్కటి పరిష్కారం..!



మన దేశంలోని సాంప్రదాయక వైద్య విధానాల్లో వేపకు చాలా ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా వానాకాలంలో సంక్రమించే చర్మ సంబంధితమైన సమస్యల కు వేపకు మించిన పరిష్కారం లేదని నిపుణులు చెబుతున్నారు. వేప నూనె, వేప ఆకులు, వేప పసరు ఇలా ఎన్నో రకాలుగా వేపను సమస్యల పరిష్కారానికి వినియోగించ వచ్చు. వేపలో నింబిడిన్, అజాడిరెక్టిన్, ఫ్లేవనాయిడ్స్ లాంటి బయోయాక్టివ్ రసాయనాలు ఉన్నాయి. వీటి కారణంగా ఫంగల్, బ్యాక్టీరియల్ వ్యాధులతోపాటు ఇన్ఫ్లమేషన్ నుంచి కూడా రక్షణ లభిస్తుంది. వానాకాలంలో గాల్లో తేమ ఎక్కువగా ఉంటుంది. ఫలిత ంగా చర్మ సంబంధిత సమస్యలు మొదలవుతాయి. వీటికి వేప చక్కని పరిష్కారం చూపుతుంది. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు చెమట ఎక్కువగా ఉత్పత్తి అయ్యి చర్మ రంధ్రాలు మలినా లతో పూడుకుపోతాయి. అది చివరకు బ్లాక్ హెడ్స్, పింపుల్స్ వంటి సమస్యలకు దారి తీస్తుంది. వేపలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాల కారణంగా బ్యాక్టీరియా ఇబ్బంది తొలగి చర్మానికి స్వాంతన దొరుకుతుందని నిపుణులు చెబుతున్నారు. చర్మంపై తెల్లని పొట్టు రేగడాన్ని ఎగ్జిమా అంటారు. ఈ సమస్య ఉన్న వారిని దురద కూడా వేధిస్తుంది. వానా కాలంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. వేపలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఎగ్జిమా నుంచి ఉపశమనం కలిగిస్తాయని హెల్త్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. ఫైటో కాంపౌండ్స్, ఫ్లేవనాయిడ్స్, అజాడిరాడియోన్ కాంపౌండ్స్ ఎగ్జిమా తీవ్రం కాకుండా నిరోధిస్తాయని అంటున్నారు. సోరియాసిస్ ఉన్న వారిలో చర్మంపై పొలుసులతో కూడిన ఎర్రటి ప్యాచెస్ ఏర్పడతాయి. దురద కూడా పెరుగుతుంది. వానాకాలంలో గాల్లోని తేమ కారణంగా సమస్య మరింత తీవ్రమవుతుంది. అయితే వేప పసరు చర్మానికి రాసుకుంటే సోరియాసిస్ నుంచి తక్షణ ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. వేప నూనెలో గాయాలను త్వరగా మానేలా చేసే గుణం కూడా ఉందని తెలుపుతున్నారు. అదేవిధంగా వానాకాలంలో అథ్లెట్స్ ఫూట్, రింగ్ వార్మ్, కాండిడియాసిస్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్లు కూడా ఎక్కువవుతాయి. అయితే వేపలోని యాంటీఫంగల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఈ సమస్యలకు సులువుగా చెక్ పెడతాయి. ఫంగస్ పెరుగుదలను అడ్డుకుని వ్యాధులను నిరోధిస్తాయి. కాబట్టి ఈ కాలంలో వచ్చే అనేక సమస్యలకు వేప మంచి పరిష్కారమని నిపుణులు సూచిస్తున్నారు.


# నేరేడు పండ్ల లాభాలు తెలిస్తే వదలరు..

నేరేడు పండు.. ఇందులో విటమిన్ సి, ఐరన్, పొటాషియం, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కావున వీటిని తింటే ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందుతాయి. ఆయుర్వేదం, ఆధునిక వైద్యం రెండింటి లోనూ దీన్ని ప్రయోజనకరంగా పరిగణిస్తారు. డయాబెటిస్ ఉన్నవారికి నేరేడు పండ్లు ఎంతో మేలు చేస్తాయి. దీనిలో ఉండే జామున్, జాము సీన్ వంటి రసాయనాలు రక్తంలోని చక్కెర స్థాయిని నియంత్రించడం లో సహాయపడతాయి. అలాగే, ఇందులో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, అజీర్ణం, గ్యాస్ సమ స్యలు తగ్గుతాయి. నేరేడు పండ్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు శరీరాన్ని వైరస్, బ్యాక్టీరియా నుంచి రక్షిస్తాయి. అలాగే, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు రక్తపోటు, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు దీని తినొచ్చు. ఇందులో తక్కువ కేలరీలు,



అధిక ఫైబర్ ఉంటుంది. కావున దీన్ని తీసుకున్నప్పుడు కడుపు నిండిన భావన కలుగుతుంది. ఇది జీవక్రియను వేగవంతం చేసి బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మ ఆరోగ్యానికి కూడా నేరేడు ఉపయోగపడుతుంది. ఇందులోని విటమిన్, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని యవ్వనంగా, ప్రకాశవంతంగా ఉంచుతాయి. ఇది కాలేయా న్ని శుభ్రపరచి ఫ్యాటీ లివర్ వంటి సమస్యల నుంచి రక్షిస్తుంది.

# మఖానా.. మంచిదేనా?



'ఫూల్ మఖానా'ను చాలామంది హెల్దీ స్నాక్స్‌గా తీసుకుంటున్నారు. శరీరానికి కావాల్సిన ప్రొటీన్, ఫైబర్, యాంటి ఆక్సిడెంట్లను పొందుతున్నారు. ఆరోగ్యానికి భరోసానిచ్చే ఈ తామర విత్తనాలు.. కొందరికి మాత్రం హాని కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్నిరకాల అనారోగ్య సమస్యలతో బాధపడేవారు.. 'మఖానా'కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. గర్భిణులు మఖానాను పరిమితంగానే తీసుకోవాలి. వీటిని ఎక్కువగా తీసుకుంటే.. శరీరంలో వేడి ఉత్పత్తి అవుతుంది. దాంతో అసౌకర్యం ఏర్పడుతుంది. కాబట్టి, వైద్యుడిని సంప్రదించిన తర్వాతే.. మఖానాను తినాలి. కిడ్నీ సమస్యలతో బాధపడేవారికీ.. మఖానా మంచిది కాదు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. మూత్రపిండాల సమస్య ఉన్నప్పుడు.. శరీరంలో పొటాషియం స్థాయిలు పెరుగుతాయి. దీర్ఘకాలంలో గుండె సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి, కిడ్నీరోగులు 'మఖానా' ముట్టకుంటేనే బెటర్! మఖానా తింటే కొందరిలో జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే ఫైబర్.. కొన్నిసార్లు గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను సృష్టిస్తుంది. అల్సర్, గుండెల్లో మంట, ఇతర జీర్ణ సమస్యలుంటే.. మఖానాను పక్కన పెట్టేయాలి. కొందరిలో 'మఖానా' అలెర్జీలకు దారితీస్తుంది. చర్మంపై దద్దుర్లు, దురద, ఇతర ఇన్ఫెక్షన్లు కనిపిస్తాయి. మఖానా తిన్నప్పుడు ఏదైనా అలెర్జీ వచ్చినట్లయితే.. వీటికి దూరంగా ఉండాలి. తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. మఖానాలో కార్బోహైడ్రేట్లు అధిక మొత్తంలో లభిస్తాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. కాబట్టి, డయాబెటిస్ ఉన్నవారు వీటికి దూరంగా ఉండటమే మంచిది. వైద్యుడి సలహా మేరకు పరిమితంగా తీసుకోవాలి.

# షుగర్ ఉన్నా.. ఈ నాలుగు ఫ్రూట్స్ తినొచ్చు!

సాధారణంగా పండ్లు తియ్యగా ఉంటాయి కాబట్టి, అందులో చక్కెర ఉంటుందని, డయాబెటిస్ ఉన్నవారు తినకూడదని అనుకుంటారు. అయితే కొన్ని పండ్లను మధుమేహులు కూడా నిరభ్యంతరంగా తీసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతూనే, అవసరమైన పోషకాలను అందించే నాలుగు పండ్ల గురించి తెలుసుకుందాం.

ఆహారపు అలవాట్లపై సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది మధుమేహ రోగులు పండ్లకు దూరంగా ఉంటారు. పండ్లలో సహజ సిద్ధమైన చక్కెర ఉంటుందనే భయంతో వాటిని తినడానికి సందేహిస్తారు. కానీ కొన్ని పండ్లు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) కలిగి ఉంటాయి, ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతాయి. అటువంటి పండ్లను తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన రీతిలో పోషకాలను పొందవచ్చు.

డయాబెటిస్ ఉన్నవారికి మేలు చేసే పండ్లు

యాపిల్స్: వీటిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను నెమ్మదించేలా చేస్తుంది, తద్వారా రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నిరోధిస్తుంది. యాపిల్స్ తినడం వల్ల కడుపు నిండిన భావన కలిగి, అనవసరమైన స్నాక్స్ తీసుకోవాలనే కోరిక తగ్గుతుంది.

నారింజ: విటమిన్ సి కి గొప్ప వనరు అయిన నారింజలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచడానికి కూడా సహాయపడతాయి.



బెర్రీ పండ్లు: స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా, శరీరంలో ఇన్ ఫ్లమేషన్ ను తగ్గించడంలో కూడా దోహదపడతాయి.

కివి ఫ్రూట్స్: కివిలో విటమిన్ సి, విటమిన్ కె, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. ఇది చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

అయితే, మధుమేహులు పండ్లను తీసుకునేటప్పుడు వాటి పరిమాణంపై శ్రద్ధ వహించాలి. ఏవైనా సందేహాలుంటే, మీ వైద్యుడిని లేదా డైటీషియన్‌ను సంప్రదించడం మంచిది. వారు మీ ఆరోగ్య పరిస్థితికి తగిన సలహాలను అందిస్తారు.

# నాన్ వెజ్ తినలేని వారికి వరం ఈ గింజలు.. తరచూ తింటే ఎన్నో లాభాలు..!



మనం ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం వ్యాయామం చేయడం మాత్రమే కాదు, ఆరోగ్యకరమైన ఆహారాలను కూడా తినాల్సి ఉ ంటుంది. కొందరు వ్యాయామం అయితే చేస్తారు కానీ అనారోగ్యకరమైన ఆహారాలను తింటారు. దీంతో వ్యాయామం చేసిన ఫలితం దక్కదు. కనుక ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం కూడా ముఖ్యమే అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇక అలాంటి ఆరోగ్యకరమైన శక్తినిచ్చే ఆహారాల్లో రాజ్మా గింజలు కూడా ఒకటి. ఇవి చిక్కుడు జాతికి చెందినవి. చూసేందుకు ముదురు గోధుమ రంగులో అచ్చం కిడ్నీల్లాగే ఉంటాయి.

అందుకనే ఈ గింజలను కిడ్నీ బీన్స్ అని కూడా అంటారు. రాజ్మా గింజలను ఉత్తరాది వారు ఎక్కువగా తింటారు. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఈ గింజలను తినడం వల్ల శక్తి లభించడమే కాదు, పోషకాలను కూడా పొందవచ్చు. అలాగే పలు వ్యాధులను నయం చేసుకోవచ్చు. రాజ్మాను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

అధికంగా ప్రోటీన్లు..: రాజ్మా గింజల్లో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా నాన్ వెజ్ తినలేని వారు ఈ గింజలను తింటే ప్రోటీన్లు అధికంగా లభిస్తాయి. దీని వల్ల శరీర కణజాలం మరమ్మత్తులకు గురవుతుంది. కండరాలు నిర్మాణమవుతాయి. కణాలు ఆరోగ్యంగా ఉంటాయి. ఒక కప్పు రాజ్మా గింజలను తింటే చాలు మనకు రోజుకు కావల్సిన ప్రోటీన్లు మొత్తం లభిస్తాయి. అందువల్ల నాన్ వెజ్ తినలేని వారికి రాజ్మా గింజలు ఉ త్తమ ఆహారం అని చెప్పవచ్చు. అలాగే శారీరక శ్రమ చేసేవారు, వ్యాయామం అధికంగా చేసే వారు సైతం ఈ గింజలను తినవచ్చు. దీంతో కోల్పోయిన శక్తిని తిరిగి పొందవచ్చు. కండరాలు నిర్మాణమవుతాయి. మళ్లీ ఉత్సాహంగా పనిచేసేందుకు కావల్సిన శక్తి లభిస్తుంది. చురుగ్గా ఉంటారు. రోజంతా శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. నీరసం, అలసట ఉండవు. బద్దకం పోతుంది. బలహీనంగా ఉన్నవారు రాజ్మాను ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

మలబద్దకానికి చెక్..: ఈ గింజలను తింటే ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. దీంతో పేగుల్లో మలం కదలికలు సులభతరం అవుతాయి. మలబద్దకం తగ్గుతుంది. ఈ గింజలు ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తాయి. వీటిని తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సులభంగా శోషించుకుంటుంది. రోగ నిరోధక వ్యవస్థ సైతం పటిష్టంగా మారుతుంది. రోగాలు, ఇన్‌ఫెక్షన్లు త్వరగా తగ్గుతాయి. ముఖ్యంగా సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలు తగ్గుతాయి. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు.

షుగర్ ఉన్నవారికి..: రాజ్మా గింజల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ గింజలను తింటే రక్తంలో షుగర్ లెవల్స్ నెమ్మదిగా పెరుగుతాయి. పైగా ఈ గింజల్లో ఫైబర్ అధికంగా ఉ ంటుంది. కనుక షుగర్ లెవల్స్‌ను తగ్గేందుకు దోహదం చేస్తుంది. రాజ్మాను తింటే శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉ పయోగించుకుంటుంది. దీంతో షుగర్ కంట్రోల్ అవుతుంది. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. ఈ గింజల్లో ఫైబర్, పొటాషియం, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. రక్త సరఫరా మెరుగు పడేలా చేస్తాయి. రక్త నాళాలను ఆరోగ్యంగా ఉ ంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. అధిక బరువు ఉన్నవారు ఈ గింజలను తింటే త్వరగా బరువు తగ్గుతారు. ఈ గింజల్లో ఉండే క్యాల్షియం ఎముకలను బలంగా మారుస్తుంది. ఇలా రాజ్మా గింజలను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# బిసి బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా సందర్శించిన సుడా చైర్మన్

## బాలురతో కలిసి సహపంక్తి భోజనం చేసిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



కరీంనగర్: ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా తెలుసుకోవడం కోసం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముకరంపుర లోని కళాశాల స్థాయి బిసి బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. బాలురతో కలిసి సహపంక్తి భోజనం చేసిన నరేందర్ రెడ్డి నాణ్యమైన భోజనం అందించే విషయంలోగానీ మెనూ ప్రకారం ఆహారం అందించే విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని వార్డెన్ కు సూచించారు. మధ్యాహ్నం ఇవ్వాల్సిన మెనూలో కొన్ని మధ్యాహ్నం ఇవ్వకుండా సాయంత్రం ఇస్తున్నామని వార్డెన్ పేర్కొనగా అలా కాకుండా మెనూ ప్రకారం ఎప్పుడు ఏది ఇవ్వాలో అది ఇవ్వాల్సిందే అని నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మెస్ ఛార్జీలు పెంచిందని ఎక్కడ కూడా రాజీ పడకుండా మంచి నాణ్యమైన భోజనం అందించాలని నరేందర్ రెడ్డి సూచించారు. సుడా చైర్మన్ ఆకస్మికంగా సందర్శించడంతో సంభందిత సిబ్బంది హడావిడి చేశారు.

# గ్రాడ్యూటీ క్లయిమ్స్ త్వరగా పూర్తి చేసుకోండి

## ఏరియా డీజీఎం పర్సనల్ శ్రీ పి.అరవింద్ రావ్ .


కమాన్ పూర్ . సింగరేణి సంస్థలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొంది వివిధ కారణాలతో గ్రాడ్యూటీ డబ్బులు తీసుకోకుండా పెండింగ్ లో ఉన్న క్లయిమ్స్ ను త్వరగా పూర్తి చేసుకోవాలని ఏరియా డీజీఎం పర్సనల్ శ్రీ పి.అరవింద్ రావ్ ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఆర్జీ 2 ఏరియాలో 130 మంది మాజీ ఉద్యోగులు క్వార్టర్ ఖాళీ చేయకుండా, 26 మంది ఎలాంటి సమాచారం లేకుండా గ్రాడ్యూటీ డబ్బులు తీసుకో కుండా ఉన్నారు. కావున వారు ఏదైనా సమస్య ఉంటే త్వరగా పరిష్కరి ంచుకొని గ్రాడ్యూటీ డబ్బులు తీసుకోవాలని వారు తెలిపారు.

# కొబ్బరి నీళ్లు ఎన్ని తాగాలి?



కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మేలని అందరికీ తెలిసిందే. ఎవరికైనా చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా కొబ్బరి నీళ్లు తాగమని సలహా ఇస్తుంటారు. రోగాలతో ఉన్నవాళ్లకే కాదు ఆరోగ్యంగా ఉన్నవాళ్లకూ ఇందులో ఉండే పోషకాలు అవసరమే. అయితే, అధికంగా పోషకాలు ఉండే కొబ్బరి నీళ్లను ఎన్ని తాగాలి? ఎన్నిసార్లు తాగాలో అవగాహన తక్కువే! పరిమితిని మించితే ఔషధం కూడా వికటిస్తుంది. ఎక్కువ మోతాదులో లవణాలు ఉండే కొబ్బరి నీళ్లను పరిమితంగా తాగడమే మేలని చెబుతున్నారు నిపుణులు. కొందరైతే.. కొబ్బరినీళ్లు లీటర్ బాటిల్ కొని గటగటా తాగేస్తుంటారు. ఇంకొందరు రెండుసార్లు విరామం ఇస్తూ లీటర్ పట్టిస్తారు. అన్నేసి కొబ్బరినీళ్లు తాగితే.. కిడ్నీలు, ఇతర అవయవాలపై భారం పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒకసారి 150–200 మిల్లీలీటర్లు తాగితే సరిపోతుందని సలహా ఇస్తున్నారు. ఆరోగ్యవంతులు వారంలో మూడు నుంచి నాలుగుసార్లు కొబ్బరినీళ్లు తాగొచ్చు. అది కూడా ఉదయం, సాయంత్రాల్లో శారీరక శ్రమ చేసిన తర్వాత లేదా వ్యాయామం ముగించిన తర్వాత కొబ్బరి నీళ్లు తాగడం మేలు! కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం రక్తపీడనాన్ని నియంత్రణలో ఉంచుతుంది. శరీరానికి కావాల్సిన గ్లూకోజ్‌ను వేగంగా అందిస్తుంది. కాళ్ల తిమ్మిర్లు తగ్గిస్తుంది.

# ఎట్ల నమ్మేతరు?



దశాబ్దాల పాటు దేశాన్ని, రాష్ట్రాల్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ చాలా సందర్భాల్లో అప్రజాస్వామికంగా, రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించిన తీరు చరిత్రలో సుస్పష్టం. ఉమ్మడి ఏపీ విషయానికొస్తే రాష్ట్ర పాలనను ఎప్పుడూ ఆంధ్రుల చేతుల్లో పెట్టి ఆ పార్టీ తెలంగాణను ఎంత నిర్లక్ష్యం చేసిందో తెలిసిందే. వద్దు వద్దు అన్నా వినకుండా తెలంగాణను ఆంధ్రులతో ముడివేసింది కాంగ్రెస్సే. తొలి, మలి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాల్లో జరిగిన అన్ని నష్టాలకు కారణం కాంగ్రెస్సే. 1973-78 మధ్యకాలంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్న జలగం వెంగళరావు నక్సలైట్ ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేశారు. ఆ కిరాతకానికి బలైనవారిలో తెలంగాణ బిడ్డలే ఎక్కువ. 1977 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెంగళరావుకు పోటీగా సత్తుపల్లిలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు నిలబడ్డారు. అది కేవలం వెంగళరావు ప్రజా ఉద్యమాల అణచివేతకు నిరసనగా చేసిన పోటీయే. ఆ ఎన్నికల్లో కాళోజీ తరఫున ప్రచారం చేయడానికి శ్రీశ్రీ సహా ఎందరో రచయితలు, కళాకారులు సత్తుపల్లిలో మకాం వేశారు. ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం అదే కాళోజీ పేరిట ఇస్తున్న పురస్కారాన్ని తెలంగాణ ప్రగతిశీల రచయితలు అందుకుంటున్నారు. ఆనాటి ఎన్‌కౌంటర్లపై విచారణకు ఊర్లలోకి వచ్చిన నిజ నిర్ధారణ కమిటీల్లో పాల్గొన్నవారు ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పదవులు, అవార్డుల కోసం ఆశపడుతున్నారు. తెలంగాణ మేధావిగా, హక్కుల నేతగా కోదండరాం గతంలో కాంగ్రెస్‌ను నిలదీసినవారే. రాజకీయాల్లోకి వచ్చిన ఆయన సొంత పార్టీ పెట్టుకొని గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నారు. చివరకు టికెట్ల విషయంలో కాంగ్రెస్ ఆయనకే మొండిచె య్యిచ్చింది. ఇంతకాలం ఓపిగ్గా కాంగ్రెస్‌తో కలిసి తిరుగుతున్నందుకు ఆయనకు ఎమ్మె ల్సీ పదవి దక్కింది. ఈ మధ్య దాన్ని సుప్రీంకోర్టు లాగేసుకున్నప్పుడు ఆయనను నెటిజన్లు సెటైర్లతో ఆడుకున్నారు. ఈసారి ఆయనతో పాటు వివాదాస్పదుడైన అజారుద్దీన్ ఎమ్మెల్సీ అవుతున్నారు. అయితే, ఇలా కాంగ్రెస్ చేతిలో తెలంగాణ మేధావులు ఆటబొమ్మలుగా మారిపోతున్నారు. ఈ నెల 9న జరగబోయే దేశ ఉప రాష్ట్రపతి ఎన్నికలో బీజేపీ అభ్యర్థికి పోటీగా తెలంగాణకు చెందిన ఓ న్యాయకోవిదుడు నిలబడ్డారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన ఆయన నిష్కల్మష ప్రజా పక్షపాతి. రాజ్యాంగం పట్ల అపారగౌరవమున్న వ్యక్తి. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వేదికలెక్కి తన గొంతును స్పష్టంగా వినిపించే వక్త, మేధావి. సోనియాగాంధీ, తదితర కాంగ్రెస్ పెద్దలు వెంట రాగా ఆయన నామినేషన్ పత్రాలు సమర్పించారు. కూటమి నుంచి వెళ్లిపోయిన ఆప్ కూడా మద్దతివ్వడంతో తాను ప్రతిపక్షాల అభ్యర్థిగా మారిపోయానని సంతృప్తి ప్రకటించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ ఎన్నికల్లో తన పోటీ అని ఆయన స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రధాన పక్షంగా ఏర్పడ్డ కూటమి అభ్యర్థికి ఓట్ల కోసం ప్రజాస్వామ్యవాదులందరూ తీవ్రంగా శ్రమిస్తున్నారు. అందరికీ నిజాయితీపరుడైన అభ్యర్థి కనబడుతున్నారు. ఆయన వెనుక హస్తం ఉందన్న విషయం అప్రాధాన్యమైంది. రాజ్యాంగాన్ని సొంత ప్రయోజనానికి వాడుకొని ఎమర్జెన్సీతో దేశంలోని ప్రజాస్వామ్యాన్ని కర్కశంగా తొక్కేసిన కాంగ్రెస్‌కి మద్దతుగా నిలబడ్డారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి ఉంటే తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా వీరినే నిలబెట్టేదా? అంటే ఔనని ఒక్కరూ అనకపోవచ్చు. తమ చెప్పుచేతల్లో ఉండే పార్టీలోని ఓ సీనియర్‌కు ఈ పదవిని కట్టబెట్టేవా రు. గెలిచే అవకాశం లేని చోట రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ ముసుగు వేసుకొని కాంగ్రెస్ నీతులు వల్లిస్తున్నది. తోడుగా నిజాయి తీపరులను వాడుకుంటున్నది. కేంద్రంలో మతతత్వ పార్టీ అధికారం లో ఉన్నందున ప్రజాస్వామ్యవాదులకు దేశానికి అవసరమైన పార్టీగా కాంగ్రెస్ కనబడుతున్నది. అయితే కష్టాల్లో ఉన్న ఆ పార్టీ గట్టెక్కేందుకు రాజ్యాంగ జపం చేస్తున్నది. ఇది పులి పశ్చాత్తాపం లాంటిదే. పార్టీల తోకలు వదిలేసి మేధావులు ఎప్పటి మాదిరి ప్రజలను చైతన్యవంతులను చేసే పనిలో పడితే అందరికీ మంచిది.



## బిహార్ ఎన్నికల్లో రోజుకు 20 హెలికాప్టర్లు

పట్నా: బిహార్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే ఆ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు హెలికాప్టర్ల బుకింగ్‌ల కోసం పోటీపడుతున్నాయి. 2020 ఎన్నికల్లో కొవిడ్ కారణంగా బుకింగ్‌లు పెద్దగా జరగలేదు. ఈసారి మాత్రం పోటాపోటీగా ప్రచారం జరగనుండటంతో గాలిమోటార్లకు గిరాకీ అమాంతం పెరిగింది. బిహార్‌లో సాధ్యమైనంత మేరకు అన్ని నియోజకవర్గాలను చుట్టేయాలని ముఖ్యనేతలు భావిస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు మార్గాలను నమ్ముకుంటే ప్రచారంలో వెనకబడతామనే భయం వారిలో నెలకొంది. అందుకే రోజుకు కనీసం 20 హెలికాప్టర్లు గాల్లో ఎగిరే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్, ఇండియా బ్లాక్ నేతలు ఇప్పటికే పలు హెలికాప్టర్లను బుక్ చేసుకొని ప్రచారానికి సిద్ధంగా ఉన్నారు. భారతీయ జనతా పార్టీ, జేడీయూ కూటమి చేతిలో డజన్‌కు పైగా హెలికాప్టర్లు ఉన్నట్లు సమాచారం. అందులో దాదాపు 12 హెలికాప్టర్లు భాజపా నేతలే వినియోగిస్తారని తెలిసింది. ఐదు హెలికాప్టర్లతో ప్రచారం ముగించేయాలని ప్రతిపక్షం భావిస్తోంది. కాంగ్రెస్ రెండు హెలికాప్టర్లను బుక్ చేసినట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆర్జేడీ కూడా కొన్ని బుక్ చేసింది. ఒక సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్ అద్దె గంటకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది. అదే డబుల్ ఇంజిన్ అయితే రూ.3 నుంచి రూ.4 లక్షలు వెచ్చించాల్సి రావొచ్చు. ఎన్నికల సందడిలో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. సింగిల్ ఇంజిన్ అద్దె 25శాతం, డబుల్ ఇంజిన్ అద్దె 100 శాతం పెరగొచ్చని తెలుస్తోంది. రోజూ వారీ కార్యక్రమాల కోసం బుకింగ్‌లు చేసుకునే నేతలు జీఎస్టీతో కలిపి మూడు గంటల అద్దె ముందుగా చెల్లించాలి. ఇదిలాఉండగాతాము పరిమిత వనరులతోనే ప్రచారం సాగిస్తున్నామని ఆర్జేడీ నేతరాజేశ్ యాదవ్ తెలిపారు. తేజస్వీకి యువత మద్దతు ఉందని వ్యాఖ్యా నించారు. తక్కువ సమయంలో ఎక్కువ ప్రాంతాలను చుట్టేయాల్సిన అవసరం ఉన్నప్పుడు మాత్రమే హెలికాప్టర్లను వినియోగిస్తామని స్పష్టంచేశారు. గత ఎన్నికల కంటే ఇప్పుడు ఎక్కువ హెలికాప్టర్లు బుక్ అయ్యాయని పట్నా ఎయిర్‌పోర్టు గ్లోబల్ ఫ్లైట్ సర్వీస్ మేనేజర్ దేవేంద్ర కుమార్ వెల్లడించారు.

## విశాఖలో గల్లీ బాయ్ గా పవన్



**విశాఖపట్టణం, తెలంగాణ దిశ :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు విశాఖ నగరం తో ఎంతో అనుబంధం ఉంది. సినీ రంగంలో టర్నింగ్ పాయింట్ కు విశాఖపట్నం. రాజకీయాల్లో మార్గదర్శకం చేసింది కూడా ఇదే నగరం.చాలా సందర్భాల్లో ఈ విషయాన్ని చెప్పుకొచ్చారు పవన్ కళ్యాణ్. పవన్ కళ్యాణ్ ఎక్కువగా విశాఖ నగరాన్ని ఇష్టపడడానికి అవే కారణాలు. ఇప్పటి సినిమా హీరోల మాదిరిగా పవన్ కళ్యాణ్ 20 ఏళ్లకే సినిమాల్లోకి రాలేదు. అసలు ఆయన సినిమా రంగంలోకి వచ్చే ఛాన్స్ లేదు. కానీ పవన్ కళ్యాణ్ కు విశాఖ నగరం సినిమాలకు అవకాశం కల్పించింది. అలా సినిమా ఛాన్సుల కోసమే విశాఖ నగరా నికి వచ్చిన పవన్ కళ్యాణ్ కు చాలా అనుబంధం ఏర్పడింది. విశాఖ నగరంలో ప్రతి గల్లీ పవన్ కళ్యాణ్ కు తెలుసు. అంత అనుబంధం ఆయనది.సోదరుడు చిరంజీవి సినిమా ఇండస్ట్రీలో మెగాస్టార్. మరో సోదరుడు నాగబాబు నిర్మాతగా ఉన్నారు. మరోవైపు ఆర్టిస్టుగా కూడా రాణిస్తున్నారు. ఆ సమయంలోనే పవన్ కళ్యాణ్ సినిమా ఎంట్రీ ఆలోచన చిరంజీవి భార్యది. అయితే అప్పటికే సిగ్గు, బిడియంతో ఉండేవారు పవన్ కళ్యాణ్. అందుకే యాక్టింగ్ లో శిక్షణ ఇప్పించాలని చిరంజీవి భావించారు. విశాఖ నగరంలో సత్యానంద్ దగ్గర శిక్షణ తీసుకున్న చాలామంది హీరోలు సినిమా రంగంలో రాణించారు. అలా పవన్ కళ్యాణ్ విశాఖ నగరంలో అడుగు పెట్టారు. సంగం-శరత్ థియేటర్ల ప్రాంతంలో అప్పట్లో ఉండేవారు. అలా సత్యానంద్ శిక్షణ లో రాటు తేలిన పవన్ అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి సినిమా ద్వారా తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం అయ్యారు. తొలి సినిమాతో మెగాస్టార్ సోదరుడు గా పరిచయమైన పవన్.. తరువాత వెనుదిరిగి చూసుకోలేదు. సినిమాల జయప జయాలతో పని లేకుండా.. తనకంటూ ఒక స్టార్ డం ఏర్పాటు చేసుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో పవర్ స్టార్ గా ఎదిగారు. అయితే తనకు నటుడిగా అవకాశం ఇచ్చింది విశాఖ నగరం అని సగర్వంగా చెబుతుంటారు పవన్.రాజకీయంగా కూడా పవన్ కళ్యాణ్ కు మార్గదర్శకం చేసింది విశాఖ నగరం. 2019 ఎన్నికల్లో తొలిసారిగా బరిలో దిగింది జనసేన పార్టీ. అప్పుడే పవన్ కళ్యాణ్ గాజువాక నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. అక్కడ త్రిముఖ పోటీలో రెండో స్థానంలో నిలిచారు. ఓటమి చవిచూసినా నియోజకవర్గ ప్రజలకు పల్లెత్తు మాట అనలేదు. పైగా విశాఖ నగరం పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నా రు. విశాఖ ప్రజలకు చాలా సార్లు అండగా నిలిచారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ పర్యటనకు వస్తే వైసిపి ప్రభుత్వం మూడు రోజులపాటు నిర్బంధించింది. ఆ సమయంలోనే పవన్ కళ్యాణ్ రాజకీయంగా మరింత రాటుదేలారు. రాజకీయంగా బలమైన ఉనికి చాటుకునే ప్రయత్నం చేశారు. వాస్తవానికి ఉభయగోదావరి జిల్లాల కంటే విశాఖలోనే పవన్ అభిమానులు ఎక్కువ. పవన్ వ్యక్తిత్వా న్ని సమర్థించే వారు ఎక్కువ. అందుకే విశాఖపట్నం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు పవన్ కళ్యాణ్. జనసేన తరఫున ఎక్కువమంది ఎమ్మెల్యేలు అయ్యారు కూడా ఈ జిల్లాల నుంచే. పార్టీ ఎటువంటి కార్యక్రమాలు మొదలుపెట్టినా విశాఖని ఎంపిక చేసుకుంటారు. శాఖ అని సగర్వంగా చెబుతుంటారు. తాజాగా సేనతో సేనాని పేరిట పార్టీ విస్తృతస్థాయి సమావేశాలు కూడా విశాఖ నగరంలోనే నిర్వహిం చారు. మొత్తానికైతే పవన్ కళ్యాణ్ విశాఖ తో ఉన్న అనుబంధం ఈనాటిది కాదు. మూడు దశాబ్దాల కిందట నాటిది.

## రాష్ట్రంలో వేగంగా ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు



**హైదరాబాద్, తెలంగాణ దిశ :** దవాఖానల్లో రాష్ట్రవ్యాప్తంగా అవుట్ పేషెంట్ (ఓపీ) కేసులు భారీగా పెరుగుతున్నాయి. భారీ వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో హైదరాబాద్‌లోని ప్రధాన దవాఖానల తో పాటు జిల్లా దవాఖానల్లో ఓపీల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. జ్వరం, జలుబు, దగ్గు, విరేచనాలు, ఒళ్లు నొప్పులు సహా ఇతర ఆరోగ్య సమస్యలతో దవాఖానలకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. గాంధీ దవాఖానలో జూన్‌లో ఓపీల సంఖ్య 56,11 3గా ఉండగా.. జూలైలో 62,058కి పెరిగింది. నిలోఫర్ పిల్లల దవాఖానాలో ఓపీల సంఖ్య ప్రతి నెల సగటున 900 వరకు ఉండగా.. అది 1,400గా నమోదైనట్టు దవాఖాన వర్గాలు తెలిపాయి. ఫీవర్ దవాఖానలో సైతం 500 వరకు నమోదయ్యే ఓపీ కేసుల సంఖ్య 750కి చేరింది. రాష్ట్రవ్యాప్తంగా ఓపీ కేసుల సంఖ్య దాదాపు 30 శాతానికి పైగా పెరిగినట్టు సమాచారం. రాష్ట్రంలో డెంగ్యూ కేసులు భారీగా పెరిగాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్ట నాటికి 4,086 కేసులు నమోదయ్యాయి. కేవలం హైదరాబాద్‌లోనే 2,060 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 243,

**పెద్ద దవాఖానలతోపాటు జిల్లాల్లోనూ అదే పరిస్థితులు**


**వర్షాకాలంలో వేగంగా ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు**

మహబూబ్‌నగర్ 198, మహబూబాబాద్ 181, వరంగల్ జిల్లా 136 డెంగ్యూ కేసులతో రాష్ట్రవ్యాప్తంగా తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. ప్రజలు డెంగ్యూ బారినపడకుండా ఇండ్లలో తప్పనిసరిగా దోమతెరలు వాడాలని వైద్యులు సూచిస్తున్నారు. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలని చెప్తున్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, గుడ్‌నైట్, ఆలౌట్ వంటి వాటిని పడుకునే రెండు గంటల ముందు ఆన్ చేసుకుని, ఆఫ్ చేసిన రెండు గంటల తర్వాత గదిలోకి వెళ్లాలని సూచిస్తున్నారు. పిల్లలను బయటకు తీసుకెళ్లేటప్పుడు నిండుగా దుస్తులు వేయాలని సూచించారు. అధిక జర్వం, తలనొప్పి, వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు, శరీరంపై ఎర్రమచ్చలు, నీరసం, చికాకుగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్తున్నారు. డెంగ్యూ కేసులతోపాటు రాష్ట్రంలో చికున్‌గున్యా కేసులు సైతం పెరుగుతున్నాయి. జనవరి నుంచి ఆగస్టు నాటికి రాష్ట్రవ్యాప్తంగా 249 కేసులు నమోదయ్యాయి. నిరుడు ఇదే సమయానికి రాష్ట్రంలో 178 కేసులు నమోదయ్యాయి. గత సంవత్సర ంతో పోలిస్తే ఇప్పటివరకు 71 కేసులు అధికంగా నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 3,856 టైఫాయిడ్ కేసులు నమోద య్యాయి. మరోవైపు రాష్ట్రంలో 184 మలేరియా కేసులు నమోదయ్యా యి.రాష్ట్రంలోని ములుగు, హైదరాబాద్, జయ శంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, ఆదిలాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి జిల్లాల్లో కేసులు గత సంవత్సరంతోపోలిస్తే పెరిగాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న వేళ కాచి వడపోసిన నీటినే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల ని, ఎప్పటికప్పుడు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని వైద్యులు సూచి స్తున్నారు. తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే తినాలని, పిల్లల చేతులు పరి శుభ్రంగా ఉండేలా చూ సుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు.

## అభివృద్ధికి ఆమడ దూరం..!

**అదిలాబాద్, తెలంగాణ దిశ :** బాసర సరస్వతి అమ్మవారి ఆలయంపై పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ప్రభుత్వాలు ఏవైనా బాసర అభివృద్ధి విషయంలో ఒక అడుగు ముం దుకు మూడు అడుగుల వెనక్కి అనే రీతిలో వివరిస్తున్నారు. బాసర ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ పెరిగి ఆదాయ వనరులు పెరుగుతున్న అభివృద్ధి మరియు పరిపాలనపై ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వివరించునపై భక్తులు మండిపడుతున్నారు. తెలంగాణ వస్తే బాసర ఆలయం ఎంతో అభివృద్ధి చెంది పర్యాటక టూరిజ దేవాదాయ కేంద్రంగా ఎదుగుతుందని ఆశపడ్డ జిల్లా వాసులకు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు భక్తులకు శాపంగా మారుతున్నాయిబాసర ఆలయానికి తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర చత్తీస్గడ్ ఒరిస్సా కేరళ కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించుకుంటున్నారు. అయితే బాసర ఆలయ అభివృద్ధి ప్రణాళికలపై ప్రభుత్వం నిధుల విషయం లో నిర్లక్ష్యంగా వివరించడమే ఇందుకు కారణం. టిఆర్ఎస్ ప్రభుత్వం 100 కోట్లతో బాసర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పట్లో ప్రకటించిన అది కార్యరూపం దాల్చలేదు. 202డిసెంబర్లో రాష్ట్రంలో పదేళ్లు పాలించిన టిఆర్ఎస్ పార్టీ ఓడిపోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రజాపాలన ప్రభుత్వం అధికారులకు వచ్చింది. ప్రభుత్వం అధికారులకు వచ్చి 21 నెలలు గడుస్తున్న బాసర ఆలయ అభివృద్ధి పరిపాలనపై ఇప్పటికి నిర్లక్ష్యంగానే వివరిస్తుందన్న విమర్శలువినవస్తున్నాయి. దక్షిణ భారతదేశంలోని ఏకైక సరస్వతి నిలయ మైన శ్రీశ్రీశ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం బాసర ఆలయ నిర్వహణ అధికారులను రెగ్యులర్ అధికారులుగా ఇప్పటికీ నియామకం చేపట్టకపో వడమే సర్కారు నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పుకుంటున్నారు.

## అడ్డంగా దొరికిపోతున్న వైసీపీ సోషల్ మీడియా




**విజయవాడ, తెలంగాణ దిశ:** ఒకప్పుడు వైయస్ జగన్ ను విమర్శించే క్రమంలో నారా లోకేష్ ఆభాసు పాలయ్యేవారు.. వైసిపి సోషల్ మీడియా కూడా లోకేష్ ను ఒక ఆట ఆడుకునేది. చినబాబు అని.. పప్పు అని..మజ్జిగ తీయగా ఉందని ఇలా రకరకాలుగా విమర్శలు చేసేది. ఇప్పుడు ఆ విమర్శలకు లోకేష్ తావు ఇవ్వడం లేదు. అవకాశం ఇవ్వడం లేదు. అంతేకాదు అవకాశం దొరికితే వదిలిపెట్టడం లేదు. ఐదేళ్లు పూర్తిగా రాటు తేలిపోయాడు నారా లోకేష్. పైగా సామాజిక మాధ్యమాలను విపరీతంగా వినియోగించుకుంటూ వైసీపీ మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. తాజాగా తన ట్విట్టర్ ఖాతాలో ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ వైసీపీ అధినేతను విమర్శించారు టిడిపి యువ నేతతెలుగుదేశం పార్టీ యువ నేత కొత్త రాజకీయాలు చేస్తున్నారు. ప్రతిపక్షాలు ఎన్ని రకాలుగా విమర్శలు చేస్తున్నప్పటికీ.. తనకంటూ బలమైన రాజకీయ పునాదిని వేసుకుంటున్నారు. ఎంతమంది ఎన్ని రకాలుగా వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ వచ్చిన అవకాశాన్ని వదిలిపెట్టడం లేదు. అవకాశం కోసం కొత్త వాతావరణాన్ని సృష్టించుకోడానికి వెనుకాడటం లేదు. అందువల్లే నారా లోకేష్ చాలామందికి నచ్చుతున్నాడు. జనం మెచ్చే నాయకుడిగా ఎదుగుతున్నాడు. బహుశా ఇంతటి మార్పు టిడిపి నేతలు కూడా ఊహించి ఉండరు. ఆ మార్పును తన ఒంట పట్టించుకోని సరికొత్త రాజకీయాలు చేస్తున్నారు నారా లోకేష్.పులివెందుల జడ్పీటిసి స్థానాన్ని కోల్పోయిన తర్వాత వైయస్ జగన్ తొలిసారిగా తన సొంత నియోజకవర్గానికి వచ్చారు. ఈ క్రమంలో పార్టీ నేతలతో భేటీ అయ్యారు. ఓటమికి సంబంధించి సమీక్ష కూడా నిర్వహించారు. నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత నియోజకవర్గంలోనే ఇలాంటి ఫలితం వస్తే.. ఎలా అని నేతల మీద మండిపడ్డట్టు తెలుస్తోంది. సతీష్ రెడ్డి, అవినాష్ రెడ్డి.. రవీంద్రనాథ్ రెడ్డి.. ఇంకా కొంతమంది సీనియర్ నాయకులతో జగన్ చాలాసేపు భేటీ అయ్యారు. అయితే జగన్ వచ్చిన తర్వాత ఆయనను కలవడానికి కార్యకర్తలు పోటీపడ్డారు. ఈ క్రమంలో తనను కలవడానికి కొంతమందికి మాత్రమే జగన్ అవకాశం ఇచ్చారు. వారికి పార్టీ నాయకులు పాస్ లు జారీ చేశారు..పాస్ లు మాత్రమే జగన్ ను కలిశారు.ఇదే విషయాన్ని ఓ పత్రిక ప్రముఖంగా ప్రస్తావించింది. దానిని ప్రముఖంగా పేర్కొంటూ లోకేష్ వ్యంగ్యంగా విమర్శలు చేశారు. ఎమ్మెల్యే ని కలవడానికి పాసులు ఇవ్వడం ఏంటని లోకేష్ మండిపడ్డారు. ఇది ఫ్యాన్ పార్టీ అధినేత స్టైల్ పరిపాలన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేష్ చేసిన ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనంగా మారింది.వైసిపి పాసుల వ్యవహారాన్ని ఓవర్గం మీడియా బలంగా ప్రచారం చేయడంతో సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది.. వాస్తవానికి ఎప్పుడు కూడా ఇటువంటి పాసుల వ్యవహారాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయ నాయకులు ప్రోత్సహించలేదు. ఒకవేళ కార్యకర్తలతో అంతర్గత సమావేశాలు నిర్వహించాలంటే.. ముందుగానే వర్తమానం పంపేవారు. వర్తమానం అందిన కార్యకర్తలతో మాత్రమే నాయకులు మాట్లాడేవారు. అంత తప్ప ఇలా పాసులు ఎన్నడూ ఇవ్వలేదు. దీనినే రాజకీయ విశ్లేషకులు తప్పు పడుతున్నారు.

## ౨౦ లక్షలు తగ్గనున్న లెక్సస్ కారు



న్యూఢిల్లీ: వాహనాలపై జీఎస్టీని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా మరో అరడజన్ వాహన సంస్థలు తమ వాహన ధరలను తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. వీటిలో కియా ఇండియా, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్, ఆడీ, నిస్సాన్, లెక్సస్, టీవీఎస్‌లు ఉన్నాయి. కియా, ఎంజీ మోటర్, ఆడీ ధరలు వెంటనే అమలులోకి రాగా, కానీ నిస్సాన్, లెక్సస్ వాహన ధరలు మాత్రం ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్నాయి. టీవీఎస్ మోటర్ వాహన ధరలను తగ్గించేదానిపై కసరత్తు చేస్తున్నది. కియా ఆయా మాడళ్లను బట్టి రూ.48,513 నుంచి రూ.4,48,542 వరకు తగ్గించింది. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ మాడళ్ల ధరలను రూ.54 వేల నుంచి రూ.3.04 లక్షల వరకు దించింది. ఆడీ ఇండియా తమ వాహన ధరలను రూ.2.6 లక్షల నుంచి రూ.7.8 లక్షల వరకు కోత విధించింది. నిస్సాన్ మోటర్ కాంప్యాక్ట్ ఎస్‌యూవీ మాగ్నైట్ మాడల్ ధరను లక్ష రూపాయల వరకు దించింది. ఈ రేటు 22 నుంచి అమలులోకి రానున్నాయి. లెక్సస్ ఇండియా కూడా తన లగ్జరీ కార్ల ధరలను రూ.1.47 లక్షల నుంచి రూ.20.8 లక్షల వరకు తగ్గించింది. ఈ రేట్లు 22 నుంచి అమలులోకి రానున్నాయని ఒక ప్రకటనలో వెల్లడించింది.

## కొత్త జీఎస్టీతో సరసమైన ధరలకు ప్రీమియం టీవీలు..

మోడీ సర్కార్ సామాన్య ప్రజలకు జీఎస్టీ సవరణలతో శుభవార్త చెప్పారు. ఈ పెస్టివల్ సీజన్‌కు ముందే సగటు ప్రజలకు అవసరయ్యే అన్ని వస్తువులపై జీఎస్టీని తగ్గించారు. ముఖ్యంగా, ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు, నిత్యావరసరాలు మరింత సరసమైన ధరలకు వినియోగదారుడికి అందుబాటులోకి రాబోతున్నాయి. ముఖ్యంగా, పండగలకు ముందు ప్రీమియం టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు కొనుగోలు చేయాలనే వారికి పండగే అని చెప్పవచ్చు. ఇంతకుముందు ప్రీయయం టీవీలతో పాటు చాలా వరకు ఎలక్ట్రిక్ ఐటమ్స్ 28 శాతం స్లాబ్‌లో ఉండేది, ఇప్పుడు 18 శాతం జీఎస్టీలోకి తీసుకువచ్చినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. సెప్టెంబర్ 22 నుంచి తగ్గిన జీఎస్టీ అమలులోకి రాబోతోంది. ముఖ్యంగా, స్మార్ట్ ఎల్ఈడీ టీవీలు, 4%ఖ% టీవీలు భారతీయ ప్రజలకు అందుబాటులోకి రావబోతున్నాయి.




## ఇక విమాన చార్జీలకు రెక్కలు..
## ఈ నెల ౨౨ నుంచి పెరగనున్న టికెట్ ధరలు..

న్యూఢిలీ: విమాన చార్జీలు భారీగా పెరగనున్నాయి. టికెట్ ధరపై ఒక్కసారిగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) భారం 50 శాతం పెరగబోతున్నది మరి. ఈ నెల 22 నుంచి ఎకానమీ మినహా మిగతా తరగతుల విమాన టికెట్లపై జీఎస్టీ 18 శాతం పడబోతున్నది. ప్రస్తుతం ఇది 12 శాతంగానే ఉండటం గమనార్హం. దీంతో ఇక ప్రీమియం ఎకానమీ, బిజినెస్ క్లాస్ ప్రయాణికులు 6 శాతం పన్నును అదనంగా చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడబోతున్నాయి. ఈ నెల 3న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో 4 స్లాబుల పన్ను విధానం స్థానంలో 2 స్లాబులనే సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. 12, 28 శాతం స్లాబులను తొలగించి.. 5, 18 శాతం స్లాబులనే కొనసాగించాలని తీర్మానించినట్టు సమావేశం అనంతరం జీఎస్టీ కౌన్సిల్ చైర్‌పర్సన్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అలాగే ఆరోగ్యానికి హానికరమైనవి, లగ్జరీ వస్తూత్పత్తులు, సేవలపై గరిష్ఠంగా 40 శాతం పన్నును నిర్ణయించినట్టు చెప్పారు. ఆయా వస్తూత్పత్తులు, సేవలపై కొత్త స్లాబుల ప్రకారం మారిన రేట్లు ఈ నెల 22 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఉదాహరణకు.. ఈ నెల 24న ప్రయాణించేందుకు, ఈ నెల 4నే మీరు ఓ బిజినెస్ క్లాస్ విమాన సీటును బుక్ చేసుకున్నారు. అప్పుడు మీ టికెట్ ధరపై 12 శాతం జీఎస్టీనే చెల్లించారు. అయితే ఇదే టికెట్‌ను ఈ నెల 23న బుక్ చేసుకుంటే టికెట్ ధరపై 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వస్తుంది. చార్టర్డ్ అకౌంటెంట్లు దీప్ కొరాడియా, మానస్ చుగ్, అంకిత్ జోషి మాట్లాడుతూ.. 'జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 14 ప్రకారం పన్ను రేట్లు మారక ముందు ఇన్వాయిస్, పేమెంట్ జరిగితే.. ఆ పన్ను రేట్లు మారిన తర్వాత సదరు సేవలు పొందినా పాత ధరలే వర్తిస్తాయి' అంటున్నారు. జీఎస్టీ రేట్లు మారకముందు టికెట్ బుక్ చేసుకుని, రేట్లు పెరిగిన తర్వాత ఒకవేళ ఆ టికెట్‌ను క్యాన్సిల్ చేసుకుంటే సదరు విమానయాన సంస్థ అప్పుడు చెల్లించిన ధర (12 శాతం జీఎస్టీ)నే రిఫండ్ చేస్తుంది. మారిన 18 శాతం రేటుతో చెల్లించదని చార్టర్డ్ అకౌంటెంట్




దీప్ కొరాడియా తెలిపారు. అయితే ఆ విమానయాన సంస్థ అనుసరించే క్యాన్సిలేషన్ చార్జీలు వర్తించే వీలున్నది. అంతేగానీ క్యాన్సిల్ చేసుకున్న టికెట్‌పై గతంలో వసూలు చేసిన జీఎస్టీని తిరిగి రిఫండ్ చేయవద్దని జీఎస్టీ చట్టంలో లేదని కొరాడియా చెప్పారు. కాబట్టి ఏదైనా కారణం చేత టిక్కెట్‌ను క్యాన్సిల్ చేసుకుంటే.. చెల్లించిన జీఎస్టీ సహా ఆ టిక్కెట్ ధరను విమానయాన కంపెనీ తప్పక ఇచ్చి తీరుతుందన్నారు. జీఎస్టీ పెరుగుదల విమానయాన రంగానికి పెద్ద దెబ్బేనని పరిశ్రమ వర్గాలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కరోనాతో తీవ్రంగా నష్టపోయిన ఏవియేషన్ ఇండస్ట్రీ.. గత కొంతకాలం నుంచే తిరిగి కోలుకుం టున్నదని వారంతా గుర్తుచేస్తున్నారు. అయితే జీఎస్టీ పెంపుతో టిక్కెట్ ధరలు పెరుగుతాయని దీంతో ప్రయాణీకుల సంఖ్య పడిపోవచ్చన్న ఆందోళన ల్ని వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ప్రయాణీకులపై ఆ భారం పడకుండా చూస్తే.. కంపెనీలకు నష్టమని పేర్కొంటున్నారు. ఏదైనా ఈ నిర్ణయం విమానయాన రంగం వృద్ధికి ఇబ్బందేనని చెప్తున్నారు. ఇక ఇప్పటికే పలు అంతర్జాతీయ సంస్థలూ జీఎస్టీ పెంపును విమర్శించిన విషయం తెలిసిందే.

## ఐటీఆర్ గడువు పొడిగించండి




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ల దాఖలుకున్న గడువు వచ్చే వారం ముగియనున్న క్రమంలో దాన్ని పొడిగించాలన్న డిమాండ్లు అంతటా పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఐటీఆర్ దాఖలుకున్న గడువు ముగుస్తున్నది. అయితే సాంకేతిక, డాటా సరిపోలని సమస్యలు రిటర్న్ దాఖలుదారులను వేధిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గడువును పొడిగించాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ)ను వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులతోపాటు వాణిజ్య, ప్రొఫెషనల్ సంఘాలు కోరుతున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికీ తీసుకెళ్తున్నారు. చివరకు ఐటీ శాఖ పనితీరు, ఏర్పాట్లపై సొంత పార్టీ నేతల నుంచీ మోదీ సర్కారుకు సెగ తగులుతుండటం గమనార్హం. కాగా, ఈ నెల7 నాటికి కేవలం 4.89 కోట్ల ఐటీఆర్‌లే దాఖలైనట్టు ఆదాయ పన్ను శాఖ పోర్టల్ గణాంకాలు చెప్తున్నాయి. నిజానికి 13.35 కోట్ల మంది వ్యక్తిగత రిజిస్టర్డ్ యూజర్లున్నారు. ఇక వెరిఫై జరిగిన రిటర్నులు 4.63 కోట్లుగానే ఉన్నాయి. వీటిలో 3.35 కోట్ల రిటర్నుల ప్రాసెస్ మాత్రమే జరిగినట్టు అధికారిక లెక్కల్ని చూస్తే అర్థమవుతున్నది. ఇప్పటికే బాంబే చార్టర్డ్ అకౌంటెంట్స్ సొసైటీ.. ఈ సమస్యలపై సీబీడీటీకి లేఖ రాసింది. ఐటీఆర్ దాఖలుకున్న గడువును పొడిగించాలని డిమాండ్ చేసింది. యాన్యువల్ ఇన్ఫర్మేషన్ స్టేట్‌మెంట్ (ఏఐఎస్), ట్యాక్స్‌పేయర్ ఇన్ఫర్మేషన్ సమ్మరీ (టీఐఎస్), ఫామ్ 26ఏఎస్‌లో డాటా మిస్‌మ్యాచ్‌లుంటున్నాయని చార్టర్డ్ అకౌంటెంట్లు, ట్యాక్స్ అడ్వకేట్స్, కన్సల్టెంట్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ ప్రధాన సమస్యలు

లాగిన్ ఫెయిల్యూర్స్, టైమౌట్స్.

అప్‌లోడ్ ఎర్రర్స్, డాటా-వ్యాలిడేషన్ మిస్‌మ్యాచ్, ఈ-వెరిఫికేషన్ సమస్యలు.

జీఎస్టీ ఫైలింగ్స్, కంపెనీల చట్టం కింద జరిగే కార్యకలాపాలతో పెరుగుతున్న రద్దీ. నాన్-ఆడిట్ ఐటీఆర్‌లకు గడువు సెప్టెంబర్ 15. 44ఏబీ సెక్షన్ కింద ట్యాక్స్ ఆడిట్ రిపోర్ట్స్‌కు చివరి తేదీ సెప్టెంబర్ 30. ఆడిట్ కేసులలో ఐటీఆర్‌లకున్న ఆఖరు తేదీ అక్టోబర్ 31.


## యువత తగ్గిపోతుండటంతో.. ఇండియా వైపు కన్నేసిన జపాన్..



ప్రస్తుతం జపాన్ లో జపాన్ దేశంలో వృద్ధులు పెరిగిపోతుండడం, పనిచేసే యువత తగ్గిపోతుండటంతో.. ఆ దేశం ఇండియా వైపు చూస్తోంది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకు మన దేశంలోని అత్యంత నైపుణ్యమున్న ప్రతిభావంతుల? కోసం మొగ్గు చూపుతున్నది. ప్రస్తుతం ఆ దేశంలో 30 శాతం మందికిపైగా 65 ఏండ్లకు పైబడిన వారే ఉన్నారు. దీంతో ఆ దేశ వర్క్ ఫోర్స్ భారీగా పడిపోతున్నది. 2040 నాటికి ఆ దేశంలో పనిచేసే వారి సంఖ్య కోటి మందికిపైగా పడిపోతుందని పలు సంస్థలు చేసిన అధ్యయనంలో వెల్లడైంది. దీంతో ఆ దేశంలోని ప్రముఖ సంస్థల్లో ఆందోళన మొదలైంది. ఇటు 2030 నాటికి దాదాపు 6 లక్షల మంది ఐటీ ఉద్యోగుల కొరత కూడా ఏర్పడుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇండియా కాకుండా అమెరికా, చైనా వంటి దేశాల్లో జీసీసీలను ఏర్పాటు చేయడంతో.. కంపెనీలకు ధరా భారంగానూ మారుతున్నట్టు చెప్తున్నారు. ఈ క్రమంలో కాస్ట్ ను తగ్గించుకునేందుకు, టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్? ప్రతిభ కలిగిన మానవ వనరులు మన దగ్గర ఎక్కువగా ఉండడంతో.. ఇండియా వైపు చూస్తున్నట్లుగా సమాచారం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,800 జీసీసీలుండగా.. అందులో జపాన్ కు చెందిన సంస్థలే 85 ఉన్నాయి. దాదాపు 5 శాతం జీసీసీలు ఆ దేశానికి చెందినవే. ఆయా సంస్థల్లో ప్రస్తుతం 1.85 లక్షల మంది పనిచేస్తున్నారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. నేడు తులం గోల్డ్ ధర రూ. 110 తగ్గింది. సిల్వర్ ధర రూ. 1000 తగ్గింది. హ్యెదరాబాద్ లో ఈరోజు 24 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.10,838, 22 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.9,935 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 100 తగ్గింది. దీంతో రూ.99,350 వద్ద అమ్ముడవుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 110 తగ్గింది. దీంతో రూ. 1,08,380 వద్ద ట్రేడ్ అవుతోంది. విజయవాడ, విశాఖ పట్నంలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99,500 వద్దకు చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,08,530 వద్ద ట్రేడ్ అవుతోంది.



# లోన్ యాప్‌ల ఆగడాలు – పరిష్కారం!




నేటి ఆధునిక కాలంలో డిజిటల్ అక్షరాస్యత పెరగడం ఆహ్వానించదగిన పరిణామమే. దేశంలోని 145 కోట్ల మంది జనాభాలో దాదాపు 115 కోట్ల మంది మొబైల్ యూనిట్లను ఉపయోగిస్తున్నారు. ఒక విధంగా చూస్తే, మొబైల్ వినియోగం తప్పనిసరిగా మారింది. వయస్సు, వృత్తితో సంబంధం లేకుండా, ఇది దైనందిన జీవితంలో అంతార్భాగమైంది. దీనినొక ఆవకాశంగా తీసుకొని, అనేక వాణిజ్య, వ్యాపార సంస్థలు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, వంచించడానికి ప్రయత్నిస్తున్నాయి. క్రమేపీ ఈ మొబైల్ సేవల బాధితులు పెరిగిపోతున్నారు.

ఈ సందర్భంలో మొబైల్ సేవలను ఉపయోగించి రుణాలు మంజూరు చేసే సంస్థలు వందలు, వేలుగా పుట్టుకొచ్చాయి. కోరిన తక్షణమే రుణాన్ని మంజూరు చేసే సదుపాయాన్ని ఈ సంస్థలు అందిస్తున్నాయి. దీని మాటున అర్హతా ప్రమాణాలు పాటించకుండా, రుణాలు మంజూరు చేయడం, విపరీతమైన వడ్డీని విధించడం, రుణ వసూళ్లకు నేరపూరితమైన పద్ధతులను పాటించడం, భౌతికంగాను, మానసికంగాను వేధించడం, చివరకు రుణగ్రస్థులు ఆత్మహత్య చేసుకొనే వరకు పీడించడం వంటివి వెలుగులోకి వస్తున్నాయి. ఈ విషయాలపై అవగాహన కల్పించడం కోసం 'అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం' (ఐద్వా) ఇటీవల (జులై 2025) బాధితులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. బాధితుల గాథలను వింటే ఇదొక సామాజిక సమస్యగా మారిందని తెలుస్తుంది. మొబైల్ యాప్‌ల ద్వారా రుణం అందించే ఈ సంస్థలు ముఖ్యంగా 'యవత'పై దృష్టి సారించి, వారిని ప్రలోభ పెడుతూ రుణం, వడ్డీ వసూళ్లకుగాను వారి తల్లిదండ్రులను, కుటుంబీకులను, స్నేహితులను, ఇతరులను అనేక వేధింపులకు గురిచేస్తున్నట్లు బాధితులు మొరపెట్టుకున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇంటి తలుపులు తట్టడం, అసభ్య పదజాలంతో దూషించడం, సామాజికంగా వారి స్థాయిని హీన పరచే విధంగా ప్రవర్తించడం వెలుగులోకి వచ్చాయి. ఆయా సందర్భాలలో పోలీసుల జోక్యం నామమాత్రంగా ఉంటున్నది.

భారతదేశంలో ఏదైనా సంస్థ డిపాజిట్లు సేకరించడం, రుణాలను మంజూరు చేయడం వంటి ఆర్థిక కార్యకలాపాలను నిర్వర్తించాలంటే రిజర్వు బ్యాంకు అనుమతి తప్పనిసరి. అవిధంగా అనుమతి పొంది డిజిటల్ రూపంలో యాప్‌ల ద్వారా రుణాలను మంజూరు చేసే అనుమతి జులై 2025 నాటికి సుమారుగా 1600 సంస్థలకు ఉన్నది. రిజర్వుబ్యాంకు వీటిని డిజిటల్ లెండింగ్ యాప్స్ (డి.ఎల్.ఎలు)గా పిలుస్తుంది. రిజర్వుబాంకు అనుమతి లేకుండా ఈ కార్యకలాపాలను నిర్వహిస్తున్న సంస్థలు అనేకం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఉదాహరణకు %-% అభిషేక్ అగర్వాల్ అనే చార్టర్డ్ అకౌంటెంట్ దాందాపు 40 డొల్ల కంపెనీల ద్వారా 750 కోట్ల రూపాయల రుణ వ్యాపారం చేశాడని, ఆపైన అతను అరెస్టయ్యాడని తెలుస్తున్నది. ఈ విధంగా నకిలీ రుణ యాప్‌లను నిర్వహిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకొనే విషయంగా రిజర్వు బాంకు ఎప్పటికప్పుడు వాటిని నిషేధిస్తూ, వాటి వివరాలను ప్రజలకు తెలియజేస్తున్నది. రిజర్వు బాంకు సమాచారం ప్రకారం 2022-2024 మధ్య కాలంలో దాదాపు 600 వరకు ఇటువంటి నకిలీ సంస్థలు యాప్‌ల ద్వారా కార్యకలాపాలను నిర్వర్తించినట్లు గుర్తించింది. వాటిపై చట్టపరమైన చర్య తీసుకొంటున్నది. అయితే అనేక రూపాలలో ఈ యాప్‌లు, సంస్థలు పుట్టుకొస్తున్నాయి. దీనిని ఆర్థిక, సైబర్ నేరంగా పరిగణించాలి. తమకు అందుతున్న ఫిర్యాదు ఆధారంగా మోసపూరిత, నకిలీ యాప్‌లను తమ యాప్ స్టోర్‌ల నుండి తొలగిస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ, నకిలీ రుణదాతలు ఏదో ఒక రూపంలో మరలా ప్రత్యక్షమవుతూనే ఉన్నారు. అంతకంతకు పెరిగిపోతున్న ఈ రుణ యాప్‌ల ఆగడాలను అరికట్టేందుకుగాను రిజర్వు బ్యాంకు 2025 మే 8న కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుంటున్న వారందరూ వీటిని క్షుణ్ణంగా తెలుసుకోవాలి. వీటిని దృష్టిలో వుంచుకొని, తగిన జాగ్రత్తలు తీసుకొనేలా ఏయే అంశాలను గమనించాలో తెలుసుకొందాం. ముందుగా రుణం పొందాలనుకుంటున్న కంపెనీ యాప్‌ను ఎవరు నిర్వహిస్తున్నారో గమనించాలి. అలాగే ఆ యాప్ ఏ స్టోర్‌లో వుందో చూడాలి. ఈ యాప్ గురించి తెలుసుకోవడానికి, వారిపై ఏవైనా ఫిర్యాదులు ఉన్నాయా అన్న విషయం తెలుసుకోవడానికి, ఆ యాప్‌కు ఆతిథ్యం (హోస్ట్) చేస్తున్న కంపెనీకి ఈ మెయిల్ పెట్టవచ్చు. అయితే రుణం తీసుకొనే తొందరలో చాలా మంది ఈ పని చేయరు. ఆ తరువాత వడ్డీకి సంబంధించి పూర్తి అవగాహన ఉండాలి. ఈ కంపెనీలు అధిక వడ్డీని వసూలు చేయడమనేది పరిపాటి. వడ్డీ సాలీనా 9.99 శాతం నుండి 45 శాతం వరకు ఉంటున్నది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం 'స్టాష్ ఫిన్' అనే కంపెనీ వడ్డీ సంవత్సరానికి 45 శాతం. అంటే దాదాపు నెలకు నాలుగు రూపాయలు. అదేవిధంగా 'పెసెన్స్' అనే కంపెనీ 40 శాతం వసూలు చేస్తున్నది. వీటిలో నెలవారీ వడ్డీ వసూలు చేసేవి, మూడు నెలలకొకసారి చేసేవి ఉన్నాయి. అయితే నెలవారీ వసూలు చేసేవే ఎక్కువ. వడ్డీ ఎంత శాతం వసూలు చేయాలనే దానిపై రిజర్వుబాంకు నిబంధన గాని, గరిష్ఠ పరిమితి గాని ఏమీ లేదు. ఇంకొక మతలబు ఏమంటే రుణం తీసుకొనే వ్యక్తికి వడ్డీ విషయాన్ని చాలా కంపెనీలు ముందుగా తెలియజేయటం లేదు. అదే విధంగా రుణ షరతుల గురించి కూడా చాలా గోప్యత ఉంటు న్నది. ఈ విషయంలో రుణం తీసుకొనే వ్యక్తి అప్రమత్తంగా ఉండాలి. మూడవది, మంజూరు చేయబడిన మొత్తాన్ని రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం రుణం తీసుకొన్న వ్యక్తి బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. కాని చాలా కంపెనీలు డిజిటల్ పేమెంట్ ఖాతాలు నిర్వహించే కంపెనీల 'వాలెట్'లు, మూడవ వ్యక్తి (థర్డ్ పార్టీ) ఖాతాలలో జమ చేస్తున్నాయి. చాలా సందర్భాలలో ఆ థర్డ్ పార్టీ రుణం ఇచ్చే కంపెనీకి అనుబంధ సంస్థ అయి ఉంటుంది. కాబట్టి దీనిని గమనించాలి.

నాల్గవది, ప్రాసెసింగ్ చార్జీలు. ఇవి ఎంత, ఏమిటి అనే విషయంగా స్పష్టత ఏమీ ఉండదు. చాలా సందర్భాలలో ఇవి రుణం మొత్తంలో 5 శాతం నుండి 10 శాతం వరకు ఉంటున్నాయి. వీటిని అప్పు తీసుకున్న వారికి ముందుగా తెలియజేయడం లేదు. వీటిపైన కూడా రిజర్వుబాంకు నియంత్రణ ఏమీ లేదు. ఎక్కువ కంపెనీలు రుణం మంజూరు చేసేటప్పుడే, ఈ చార్జీలను మినహాయించుకొని, మిగిలిన మొత్తాన్ని అతనికి బదిలీ చేస్తున్నాయి.

ఐదవది అతి ముఖ్యమైనది రుణగ్రహీతకు జీవిత బీమా చేయడం. ప్రతి కంపెనీ దీనిని తప్పనిసరి చేస్తున్నాయి. పైకి ఇది రుణగ్రహీత అనుకోని సందర్భంలో మరణిస్తే కంపెనీకి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు అనిపిస్తుంది. దీని ప్రీమియమ్‌లన్నీ కూడా రుణ గ్రహీతే చెల్లించాలి. ఇవి వడ్డీతో కలిపి వసూలు చేయబడతాయి. ఇటీవల జరిపిన కొన్ని అధ్యయనాలు, పోలీసు కేసుల ద్వారా వెలుగులోకి వచ్చిన అంశం ఏమంటే రుణ గ్రహీతలు అప్పు చెల్లించలేని సందర్భాలలో వారిని చనిపోయేందుకు ప్రేరేపిస్తున్నారు. ఇది ఇంకా నిగ్గు తేలవలసి ఉంది. ఏదైనా ప్రత్యేక దర్యాప్తును ఆదేశిస్తే తప్ప, ఇటువంటి విషయాలు వెలుగులోకి రావు.

ఆరవది రుణ గ్రహీతను, వారి కుటుంబ సభ్యులను మానసికంగా, సామాజికంగా వేధించడం. దీనికి సంబంధించి అనేక సందర్భాలలో కేసులు నమోదవుతున్నాయి. వసూలుకుగాను కంపెనీలు కొంతమంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవడం, వారి ద్వారా అమానవీయ కార్యకలాపాలు చేపట్టడం సాధారణంగా మారుతున్నది. దీనిని అరికట్టకపోతే ఇదొక సామాజిక సమస్యగా పరిణమిస్తుంది. ఈ విషయమై రుణం ఇచ్చే కంపెనీకి (ఆర్.బి.ఐ రెగ్యులేటెడ్ ఎంటిటీ), ఏజెంటుకు (లోన్ సర్వీస్ ప్రొవైడర్-ఎల్.ఎస్.పి) మధ్య తప్పనిసరిగా కాంట్రాక్టు అగ్రిమెంట్ ఉండాలని రిజర్వు బ్యాంకు స్పష్టం చేసింది. అప్పుడే ఏజెంట్ అనైతిక చర్యలకు లోన్ కంపెనీని బాధ్యుని చేయగలుగుతాం. అలాగే రిజర్వుబాంకు రుణానికి సంబంధించిన నియమ నిబంధనలన్నింటిని ముందుగానే రుణగ్రహీతకు తెలియ చేయాలని, రుణం మంజూరు చేసిన వెంటనే, అతని వెంటపడకుండా ఒక 'కూలింగ్ ఆఫ్' కాలం ఉండాలని నిర్దేశించింది.

# శ్రీదేవి చివరి కోరిక.. కుటుంబ సభ్యులు తీర్చారా..?



అతిలోక సుందరి శ్రీదేవి గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. తొలుత బాలనటిగా సినిమా రంగంలో అడుగుపెట్టిన శ్రీదేవి, అనంతరం తన అందం, అభినయం, నటనతో భారతీయ సినిమా లోకాన్ని శాసించింది. 300కు పైగా సినిమాల్లో నటించి, "అతిలోక సుందరి"గా అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకుంది. తెలుగు, తమిళ, మళయాళం, హిందీ వంటి భాషల్లో విస్తృతంగా నటించి, కోట్లాది మంది అభిమానుల మనసులు గెలుచుకుంది. అయితే, సినీ ప్రపంచాన్ని తీరని విషాదంలో ముంచెత్తుతూ, 2018 ఫిబ్రవరిలో శ్రీదేవి ఆకస్మికంగా మరణించింది. తన మేనల్లుడి వివాహ కార్యక్రమానికి హాజరవడానికి దుబాయ్ వెళ్లిన సమయంలో, అక్కడి ఓ హొటల్ గదిలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందింది. ఈ ఘటనతో సినీ పరిశ్రమతో పాటు దేశవ్యాప్తంగా ఆమె అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. అయితే శ్రీదేవి జీవితాంతం తెలుపు రంగును ఎంతో అభిమానించింది. ఆమె నటించిన అనేక సినిమాల్లో, పాటలలోనూ తెలుపు రంగు దుస్తులు కనిపించడం చూస్తే, ఆమెకు ఆ రంగు మీద ఉన్న ప్రేమ స్పష్టమవుతుంది.

ఈ నేపథ్యానుగుణంగానే, శ్రీదేవి తన ఆఖరి కోరికగా "తన అంత్యక్రియలు తెలుపు రంగుతో జరగాలి" అని పలు ఇంటర్వ్యూల్లో చెప్పింది. ఆమె కుటుంబ సభ్యులు ఈ కోరికను తీరుస్తూ, అంత్యక్రియలన్నీ తెలుపు రంగు పూలతో నిర్వహించారు. ఆమె మృతదేహాన్ని ఉంచిన స్థలాన్ని తెల్ల మల్లెలు, తెల్ల గులాబీలతో అలంకరించారు. అంతిమ యాత్రకు తీసుకెళ్లిన వాహనాన్ని కూడా తెలుపు పువ్వులతో అలంకరించారు. ఈ విధంగా, ఎంతో దుఃఖంలోనూ శ్రీదేవి ఆఖరి కోరికను నెరవేర్చిన ఆమె కుటుంబం, ఆమెకి తగిన గౌరవాన్ని అందించింది. శ్రీదేవి ఈ రోజు మన మధ్య లేకపోయినా, ఆమె సినిమాలు, నటన, ఆమె అందం తెలుగు సహా భారతీయ సినీ ప్రపంచంలో ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయి.

# సినిమా..

## మళ్లీ సినిమాలు చేస్తానంటున్న ఇలియానా..



గోవా బ్యూటీ ఇలియానా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దేవదాసు సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి ఆ తర్వాత రాఖీ, పోకిరి, జల్సా వంటి సూపర్‌హిట్‌లను అందుకోవడమే కాకుండా స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది.

ఒకప్పుడు స్టార్ నటిగా రూల్ చేసిన ఈ భామ ప్రస్తుతం సినిమాలు మానేసి ఫ్యామిలీతో సమయం గడుపుతున్న విషయం తెలిసిందే. 2023లో మైఖేల్ డోలన్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్న ఇలియానా ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చింది. అయితే గత కొన్ని రోజులుగా ఫ్యామిలీతోనే గడుపుతున్న ఈ భామ.. తాజాగా మళ్లీ సినిమాలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ ప్రస్తుతం తాను తన ఇద్దరు కొడుకుల సంరక్షణలో బిజీగా ఉన్నానని, అందుకే సినిమాలకు విరామం తీసుకున్నానని ఇలియానా చెప్పింది. అలాగే అభిమానులు నన్ను ఎంతగా మిస్ అవుతున్నారో నాకు తెలుసు. నటన అంటే నాకెంతో ఇష్టం. తెరపై కనిపించడం, విభిన్నమైన పాత్రలు పోషించడం, సెట్‌లో ఉండే సందడి ఇవన్నీ నాకు చాలా ఇష్టం.నా కెరీర్‌లో ఎంతోమంది గొప్ప వారితో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం అని ఇలియానా అన్నారు.

అయితే పిల్లల బాధ్యతకు తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని, అందుకే కొద్ది రోజులు ఆగి మళ్లీ వస్తానని ఆమె తెలిపారు. తిరిగి వచ్చే ముందు మానసికంగా, శారీరకంగా సిద్ధం కావడానికి కొంత సమయం పడుతుంది. ఏ పని చేసినా దానికి పూర్తిగా న్యాయం చేయాలనుకుంటాను అని ఆమె ఇలియానా తెలిపారు.

# హీరోయిన్ కాకుంటే రాశీ ఖన్నా ఏమయ్యేదో తెలుసా..!



ప్రస్తుతం టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలుగుతున్నరాశీ ఖన్నాకి సంబంధించిన ఆసక్తికర విషయం నెట్టింట వైరల్ అవుతుంది.నటన అనేది తన గోల్ కాదని, ఐఏఎస్ ఆఫీసర్ కావాలని ఎన్నో కలలు కన్నానని చెప్పుకొచ్చింది. చదువులో ఎప్పుడూ ముందు వరుసలో నిలిచిన ఈ ఢిల్లీ అమ్మాయి, జీవితంలో టర్నింగ్ పాయింట్స్ గురించి ఊహించలేదు. 1990 నవంబర్ 30న ఢిల్లీలో జన్మించిన రాశి ఖన్నా, చిన్నప్పటి నుంచే పాఠశాలలో టాపర్‌గా నిలిచేది. ఢిల్లీ యూనివర్సిటీలో ఇంగ్లీష్ లిటరేచర్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసింది.డిగ్రీ చదువుతున్న సమయంలోనే కొంతకాలం అడ్వర్టైజ్మెంట్ ఏజెన్సీ కోసంకాపీ రైటింగ్ కూడా చేసింది. అదే సమయంలో ఐఏఎస్ కావాలన్న స్వప్నాన్ని గుండెల్లో పెట్టుకుని ముందుకు సాగింది. కానీ జీవితం లో ఊహించని మలుపులతో నటన వైపు వచ్చేసింది. డిగ్రీ చదువుతున్న సమయంలోనే మోడలింగ్ అవకాశాలు వచ్చిన రాశి, తక్కువ సమయంలోనే వెండితెరపై అడుగుపెట్టింది. 2013లో సుజిత్ సర్కార్ దర్శకత్వంలో వచ్చిన 'మద్రాస్ కేఫ్' ద్వారా బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఇందులో జాన్ అబ్రహం భార్యగా నటించిన ఈమెను ప్రేక్షకులు గుర్తుపెట్టుకున్నారు. 2014లో నాగశౌర్యతో కలిసి నటించిన 'ఊహలు గుసగుసలాడే' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది రాశి ఖన్నా. ఆతర్వాత 'మనమ్','తొలిప్రేమ','వెంకీమామ', 'ప్రతిరోజూ పండగే', 'సర్దార్','థాంక్యూ' వంటి చిత్రాల్లోనటించి క్లాస్ అండ్ మాస్ ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఐఏఎస్ ఆఫీసర్ అవ్వాలన్న కలను పక్కన పెట్టి, ఇప్పుడు ఒక్కో చిత్రానికి కోటికి పైగా పారితోషికం తీసుకుంటున్న రాశి ఖన్నా,తమిళ్, హిందీ ఇండస్ట్రీలలో కూడా తన స్థానాన్ని కల్పిం చుకుంది. ఇటీవల పవన్ బర్త్‌డే సందర్భంగా షూటింగ్ సెట్స్‌లో నుంచి ఒక ఫోటో లీక్ చేసి ఫ్యాన్స్‌కి మంచి కిక్ ఇచ్చింది. మొత్తానికి రాశీ ఖన్నా డ్రీమ్ గోల్ చాలా పెద్దదే అని తెలు సుకొని ఫ్యాన్స్ అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# ఇక విమాన చార్జీలకు రెక్కలు..!




న్యూఢిల్లీ: విమాన చార్జీలు భారీగా పెరగనున్నాయి. టికెట్ ధరపై ఒక్కసారిగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) భారం 50 శాతం పెరగబోతున్నది మరి. ఈ నెల 22 నుంచి ఎకానమీ మినహా మిగతా తరగతుల విమాన టికెట్లపై జీఎస్టీ 18 శాతం పడబోతున్నది. ప్రస్తుతం ఇది 12 శాతంగానే ఉండటం గమనార్హం. దీంతో ఇక ప్రీమియం ఎకానమీ, బిజినెస్ క్లాస్ ప్రయాణికులు 6 శాతం పన్నును అదనంగా చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడబోతున్నాయి. ఈ నెల 3న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో 4 స్లాబుల పన్ను విధానం స్థానంలో 2 స్లాబులనే సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. 12, 28 శాతం స్లాబులను తొలగించి.. 5,18 శాతం స్లాబులనే కొనసాగించాలని తీర్మానించినట్టు సమావేశం అనంతరం జీఎస్టీ కౌన్సిల్ చైర్‌పర్సన్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అలాగే ఆరోగ్యానికి హానికరమైనవి, లగ్జరీ వస్తూత్పత్తులు, సేవలపై గరిష్ఠంగా 40 శాతం పన్నును నిర్ణయించినట్టు చెప్పారు. ఆయా వస్తూత్పత్తులు, సేవలపై కొత్త స్లాబుల ప్రకారం మారిన రేట్లు ఈ నెల 22 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఉదాహరణకు.. ఈ నెల 24న ప్రయాణించేందుకు, ఈ నెల 4నే మీరు ఓ బిజినెస్ క్లాస్ విమాన సీటును బుక్ చేసుకున్నారు. అప్పుడు మీ టికెట్ ధరపై 12 శాతం జీఎస్టీనే చెల్లించారు. అయితే ఇదే టికెట్‌ను ఈ నెల 23న బుక్ చేసుకుంటే టికెట్ ధరపై 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వస్తుంది. చార్టర్డ్ అకౌంటెంట్లు దీప్ కొరాడియా, మానస్ చుగ్, అంకిత్ జోషి మాట్లాడుతూ.. 'జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 14 ప్రకారం పన్ను రేట్లు మారక ముందు ఇన్వాయిస్, పేమెంట్ జరిగితే.. ఆ పన్ను రేట్లు మారిన తర్వాత సదరు సేవలు పొందినా పాత ధరలే వర్తిస్తాయి' అంటున్నారు. జీఎస్టీ రేట్లు మారకముందు టికెట్ బుక్ చేసుకుని, రేట్లు పెరిగిన తర్వాత ఒకవేళ ఆ టికెట్‌ను క్యాన్సిల్ చేసుకుంటే సదరు విమానయాన సంస్థ అప్పుడు చెల్లించిన ధర (12 శాతం జీఎస్టీ)నే రిఫండ్ చేస్తుంది. మారిన 18 శాతం రేటుతో చెల్లించదని చార్టర్డ్ అకౌంటెంట్ దీప్ కొరాడియా తెలిపారు. అయితే ఆ విమానయాన సంస్థ అనుసరించే క్యాన్సిలేషన్ చార్జీలు వర్తించే వీలున్నది. అంతేగానీ క్యాన్సిల్ చేసుకున్న టికెట్‌పై గతంలో వసూలు చేసిన జీఎస్టీని తిరిగి రిఫండ్ చేయవద్దని జీఎస్టీ చట్టంలో లేదని కొరాడియా చెప్పారు. కాబట్టి ఏదైనా కారణం చేత టిక్కెట్‌ను క్యాన్సిల్ చేసుకుంటే.. చెల్లించిన జీఎస్టీ సహా ఆ టిక్కెట్ ధరను విమానయాన కంపెనీ తప్పక ఇచ్చి తీరుతుందన్నారు. జీఎస్టీ పెరుగుదల విమానయాన రంగానికి పెద్ద దెబ్బేనని పరిశ్రమ వర్గాలు, నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. కరోనాతో తీవ్రంగా నష్టపోయిన ఏవియేషన్ ఇండస్ట్రీ.. గత కొంతకాలం నుంచే తిరిగి కోలుకుం టున్నదని వారంతా గుర్తుచేస్తున్నారు. అయితే జీఎస్టీ పెంపుతో టిక్కెట్ ధరలు పెరుగుతాయని దీంతో ప్రయాణీకుల సంఖ్య పడిపోవచ్చన్న ఆందోళన ల్ని వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ప్రయాణీకులపై ఆ భారం పడకుండా చూస్తే.. కంపెనీలకు నష్టమని పేర్కొంటున్నారు. ఏదైనా ఈ నిర్ణయం విమానయాన రంగం వృద్ధికి ఇబ్బందేనని చెప్తున్నారు. ఇక ఇప్పటికే పలు అంతర్జాతీయ సంస్థలూ జీఎస్టీ పెంపును విమర్శించిన విషయం తెలిసిందే.

# ఐటీఆర్ గడువు పొడిగించండి

న్యూఢిల్లీ,ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల దాఖలుకున్న గడువు వచ్చే వారం ముగియనున్న క్రమంలో దాన్ని పొడిగించాలన్న డిమాండ్లు అంతటా పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఐటీఆర్ దాఖలుకున్న గడువు ముగుస్తున్నది. అయితే సాంకేతిక, డాటా సరిపోలని సమస్యలు రిటర్న్ దాఖలుదారులను వేధిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గడువును పొడిగించాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ)ను వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులతోపాటు వాణిజ్య, ప్రొఫెషనల్ సంఘాలు కోరుతున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికీ తీసుకెళ్తున్నారు. చివరకు ఐటీ శాఖ పనితీరు, ఏర్పాట్లపై సొంత పార్టీ నేతల నుంచీ మోదీ సర్కారుకు సెగ తగులుతుండటం గమనార్హం. కాగా, ఈ నెల7 నాటికి కేవలం 4.89 కోట్ల ఐటీఆర్‌లే దాఖలైనట్టు ఆదాయ పన్ను శాఖ పోర్టల్ గణాంకాలు చెప్తున్నాయి. నిజానికి 13.35 కోట్ల మంది వ్యక్తిగత రిజిస్టర్డ్ యూజర్లున్నారు. ఇక వెరిఫై జరిగిన రిటర్నులు 4.63 కోట్లుగానే ఉన్నాయి. వీటిలో 3.35 కోట్ల రిటర్నుల ప్రాసెస్ మాత్రమే జరిగినట్టు అధికారిక లెక్కల్ని చూస్తే అర్థమవుతున్నది.

ఇప్పటికే బాంబే చార్టర్డ్ అకౌంటెంట్స్ సొసైటీ.. ఈ సమస్యలపై సీబీడీటీకి లేఖ రాసింది. ఐటీఆర్ దాఖలు కున్న గడువును పొడిగించాలని డిమాండ్ చేసింది. యాన్యువల్ ఇన్ఫర్మేషన్ స్టేట్‌మెంట్ (ఏఐ




ఎస్), ట్యాక్స్‌పేయర్ ఇన్ఫర్మేషన్ సమ్మరీ (టీఐఎస్), ఫామ్ 26ఏఎస్‌లో డాటా మిస్‌మ్యాచ్‌లుంటున్నాయని చార్టర్డ్ అకౌంటెంట్లు, ట్యాక్స్ అడ్వకేట్స్, కన్సల్టెంట్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**ఇవీ ప్రధాన సమస్యలు** లాగిన్ ఫెయిల్యూర్స్, టైమౌట్స్.అప్‌లోడ్ ఎర్రర్స్, డాటా-వ్యాలిడేషన్ మిస్‌మ్యాచ్,ఈ-వెరిఫికేషన్ సమస్యలు. జీఎస్టీ ఫైలింగ్స్, కంపెనీల చట్టం కింద జరిగే కార్యకలాపాలతో పెరుగుతున్న రద్దీ.నాన్-ఆడిట్ ఐటీఆర్‌లకు గడువు సెప్టెంబర్ 15. 44ఏబీ సెక్షన్ కింద ట్యాక్స్ ఆడిట్ రిపోర్ట్స్‌కు చివరి తేదీ సెప్టెంబర్ 30. ఆడిట్ కేసులలో ఐటీఆర్‌లకున్న ఆఖరు తేదీ అక్టోబర్ 31

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215